శనివారం
13-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 291
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ముంబై విమానాశ్రయంలో 7.94 కేజీల బంగారం సీజ్

ముంబై : ముంబై విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సుమారు 7.94 కేజీల బంగారాన్ని సీజ్ చేశారు. ఏప్రిల్ 8 నుంచి 10వ తేదీ మధ్య ఈ బంగారం పట్టుకున్నారు. సీజ్ చేసిన బంగారం ధర సుమారు రూ.4.69 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. బంగారాన్ని వేర్వేరు రూపాల్లో స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. వ్యాక్స్, రోడియం ప్లేట్ వైర్లు, బకల్, వాషర్ షేప్ రింగులు, క్రూడ్ జ్యూయలరీ రూపంలో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురు ప్రయాణికులను అరెస్టు చేశారు. అబుదాబి నుంచి బ్యాంకాక్ వెళుతున్న ఇద్దరు విదేశీయులను ట్రాన్సిట్‌లో పట్టుకున్నారు.

దిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర

మంత్రి అతిశి సంచలన ఆరోపణలు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో రాష్ట్రపతి పాలనకు బీజేపీ పెద్ద రాజకీయ కుట్రకు తెరతీసిందని దిల్లీ మంత్రి అతిశి విమర్శించారు. దిల్లీ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడానికి రాజకీయ కుట్రలో భాగంగా దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని మండిపడ్డారు. ఈ మేరకు తమకు విశ్వసనీయ సమాచారం అందిందని అతిశి వెల్లడించారు. ఒకవేళ దిల్లీలో రాష్ట్రపతి పాలన విధిస్తే అది ముమ్మాటికీ చట్టవిరుద్ధం...ప్రజాతీర్పుకు వ్యతిరేకమేనని స్పష్టంచేశారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఉన్నాయని అతిశి వెల్లడించారు. మంత్రి అతిశి శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మోదీ సర్కారుపై నిప్పులు చెరిగారు. కనీస ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో అరెస్టు చేశారని, దిల్లీలో ఎన్నికైన ప్రజా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రలో భాగంగానే కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని అతిశి విమర్శించారు. గతంలోని అనుభవాలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నట్లు తెలిపారు. అనేక విభాగాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ అధికారులను కేటాయించడం లేదని, ఎన్నికల తేదీలు

- మిగతా 2 లో

సీబీఐ కస్టడీకి కవిత

▸ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశం ▸ 15 వరకు దర్యాప్తు సంస్థ విచారణ

న్యూదిల్లీ : దిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మూడు రోజుల సీబీఐ కస్టడీకి రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం అనుమతించింది. దీంతో కవితను సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించనున్నారు. ఈనెల 15న ఉదయం 10 గంటలకు కవితను కోర్టులో హాజరు పర్చాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మద్యం విధానంలో కీలక సూత్రధారి, పాత్రధారి కవితే అని సీబీఐ వాదించింది. విచారణకు ఆమె సహకరించడం లేదని, అందుకే కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నట్లు కోర్టుకు విన్నవించింది. మరోవైపు కవితకు రౌస్ అవెన్యూ కోర్టులో చుక్కెదురైంది. సీబీఐ ప్రశ్నించడాన్ని సవాల్ చేస్తూ దాఖలయిన పిటిషన్‌తో పాటు అరెస్టును సవాల్ చేస్తూ దాఖలయిన పిటిషన్లను కోర్టు తోసిపుచ్చింది. కాగా తనను సీబీఐ అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తనను కస్టడీకి ఇవ్వొద్దని, ఇప్పటికే సీబీఐ తనను ప్రశ్నించిందని, అడిగిన ప్రశ్నలనే మళ్లీ మళ్లీ సీబీఐ

- మిగతా 2 లో

తాగునీటికి 14 టీఎంసీలు

▸ ఏపీకి 5.5 టీఎంసీలు, తెలంగాణకు 8.5 టీఎంసీలు
▸ నీటి కేటాయింపులు చేస్తూ కేఆర్ఎంబీ నిర్ణయం
▸ మే నెలలో మరోసారి త్రిసభ్య కమిటీ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొన్న నేపథ్యంలో కేఆర్ఎంబీ కీలక నిర్ణయం తీసుకుంది. నాగార్జునసాగర్ జలాశయంలో 500 అడుగులపైన ఉన్న 14 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. అందుబాటులో ఉన్న 14 టీఎంసీలలో తెలంగాణకు 8.5, ఆంధ్రప్రదేశ్‌కు 5.5 టీఎంసీల నీటిని కేటాయించింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే నేతృత్వంలో శుక్రవారం హైదరాబాద్ జలసౌధలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ అనిల్ కుమార్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. జంట జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో కొద్దిపాటి నీరు ఉన్నందున జూన్ వరకు జాగ్రత్తగా తాగునీటి అవసరాల కోసం వాడుకునే విషయమై సమావేశంలో చర్చించారు.

అక్టోబరులో తీసుకున్న నిర్ణయాలు, ప్రస్తుత నీటి అవసరాలపై చర్చ జరిగింది. గతంలో ఏపీకి 45, తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయించగా, అందులో తమకు మరో ఐదు టీఎంసీల మిగులు ఉందని, తెలంగాణ అదనంగా 7 టీఎంసీలు వినియోగించుకొందని ఏపీ ఈఎన్సీ నారాయణ రెడ్డి తెలిపారు. ఆ కేటాయింపుల ప్రకారం నాగార్జునసాగర్ నుంచి తక్షణమే తమకు ఆ 5 టీఎంసీల నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటివరకు కేటాయించిన దానికంటే ఎక్కువ మొత్తాన్నే వినియోగించుకొందని, అంతా లెక్కల్లోకి రాలేదని తెలంగాణ ఈఎన్సీ అనిల్ పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవసరాలకైనా ఏపీ నీరు తీసుకోకుండా చూడాలని కోరారు. సాగర్ దిగువన తమకు కూడా తాగునీటికి చాలా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్లతో ప్రత్యేకంగా నీరు సరఫరా చేయాల్సి వస్తోందని ఏపీ ఈఎన్సీ తెలిపారు. సాగర్ కుడికాల్వ నుంచి వీలైనంత ఎక్కువ నీరు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌తో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో ఎక్కువ మంది తాగునీటి కోసం సాగర్‌పై ఆధారపడ్డారని తెలంగాణ ఈఎన్సీ వివరించారు. హైదరాబాద్ జనాభాను పరిగణనలోకి తీసుకొని తాగునీటి కోసం ఎక్కువ మొత్తం కేటాయించాలని కోరారు. దీంతో నాగార్జునసాగర్‌లో 500 అడుగులపైన ఉన్న 14 టీఎంసీల నీటిలో తెలంగాణకు కేటాయింపును పెంచుతూ సమావేశం నిర్ణయం తీసుకుంది. మే నెలలో త్రిసభ్య కమిటీ మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ నీటిని తాగునీటి అవసరాల కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలకు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది.

ఇంటర్ ఫలితాల్లో బాలికల సత్తా

▸ కృష్ణాజిల్లా టాప్
▸ ప్రథమ - 67, ద్వితీయ - 78 శాతం ఉత్తీర్ణత
▸ 22 రోజుల్లోనే ఫలితాల విడుదల
▸ మే 24 నుంచి సప్లిమెంటరీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యామండలి నిర్వహించిన వార్షిక పరీక్షల (మార్చి 2024) ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కృష్ణాజిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఇంటర్మీడియట్ బోర్డు

- మిగతా 2 లో

కేసుల వివరాలకు జాప్యం ఎందుకు?

▸ అవసరమైతే నలుగురిని కేటాయించి తక్షణమే ఇవ్వండి
▸ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రజా ప్రతినిధులపై ఉన్న కేసుల వివరాలు ఇవ్వకపోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, నారాయణ, అయ్యన్న పాత్రుడు, రామచంద్ర యాదవ్‌పై ఉన్న కేసుల వివరాలు ఇవ్వకపోవడంపై

- మిగతా 2 లో

దేశంలో మార్పు అవశ్యం

▸ గుంటూరు నుంచే ఆరంభం కావాలి
▸ బీజేపీ, దాని పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలి
▸ గుంటూరు సభలో రామకృష్ణ, శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గుంటూరు: 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించి దేశ, రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టాలని, అది గుంటూరు జిల్లా నుంచి ప్రారంభం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆకాంక్షించారు. అందుకోసం ప్రతి కార్యకర్త అభ్యర్థుల్లా పనిచేస్తూ ప్రజల్లోకి వెళ్లాలని, ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఇండియా కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభకు డీసీసీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, స్వేచ్ఛగా మాట్లాడే... సొంతంగా నిర్ణయం తీసుకునే పరిస్థితులు మృగ్యమయ్యాయని ఆరోపించారు. కేసుల పేరుతో బెదిరిస్తూ దేశ రాజకీయాలను మోదీ శాసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల ప్రధానిగా మోదీ దేశానికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేశారా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానన్న హామీని విస్మరించారని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల ఊసే లేదని, రైతు ఆత్మహత్యల నివారణకు చర్యలు, నల్లధనం వెలికితీస్తానన్న హామీపై స్పందనే లేదని విమర్శించారు. చెప్పుకోవడానికి ఏమి లేక మైండ్ గేమ్ రాజకీయాలకు తెరతీశారన్నారు. మోదీ హయాంలో ఉద్యోగ కల్పన లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, అవినీతితో సతమతమౌతున్నట్లు 65 శాతం మంది ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించినట్లు సర్వేలు సూచిస్తున్నాయన్నారు. కులమతాలకతీతంగా అంతా కలిసి

- మిగతా 2 లో

అవినాశ్ రెడ్డిని ఓడిస్తా

▸ హంతకులకు జగనన్న మద్దతు ఇస్తున్నాడు
▸ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలి ▸ ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల : మీ అందరి ఆశీస్సులతో, మీ చల్లని దీవెనలతో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని ఓడిస్తానని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పునరుద్ఘాటించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పులివెందుల పట్టణంలో ఆమె ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాన్ని చూడలేక తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని, అవినాశ్ రెడ్డి వంటి హంతకులను ఓడించేందుకు కాంగ్రెస్ నుంచి కడప లోక్‌సభకు పోటీ చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో త్యాగాలు కూడా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏం చెప్పమంటావ్ వొదినా మా కష్టాలు? ఒకటా? రెండా?

పవన్‌కు 'బకెట్' గుబులు!

▸ గాజుగ్లాసును పోలిన గుర్తు
▸ అవే పేర్లతో నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థుల పోటీ
▸ జనసేన నేతల్లో ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో బకెట్ గుర్తు చిచ్చురేపుతోంది. ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీ అయిన జనసేనకు బకెట్ గుర్తు గుబులు పట్టుకుంది. ఇప్పటికే జనసేన గుర్తును ఫ్రీ సింబల్‌గా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. దానిపై ఆ పార్టీ నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించి గుర్తుకోసం తంటాలు పడుతున్నారు. మరోవైపు జనసేన గుర్తు గాజు గ్లాసును పోలివున్న ఈ బకెట్ గుర్తుతో ఆ పార్టీ అధినేత పవన్‌కు నిద్రలేకుండా చేస్తోంది. ఒక్క బకెట్ గుర్తేకాదు... నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల పేర్లు సైతం జనసేన అభ్యర్థులు పోలిన పేర్లతోనే బకెట్ గుర్తు అభ్యర్థులు

- మిగతా 2 లో

యుద్ధమేఘాలు

48 గంటల్లోగా ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడి

వాషింగ్టన్: ఇరాన్ - ఇజ్రాయిల్ మధ్య యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. 48 గంటల్లోగా ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడి చేసే అవకాశం ఉందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారని పేర్కొంది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయని తెలిపింది. ఇజ్రాయిల్‌పై ప్రత్యక్షంగా దాడి చేస్తే పొంచి ఉండే రాజకీయ ముప్పును ఇరాన్ అంచనా వేస్తోందని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. దాడి ప్రతిపాదనపై తుది నిర్ణయం ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వాధినేత అయాతుల్లా అలీ ఖమేనీ వద్ద ఉందని, రాజకీయ పరిస్థితులను అంచనా వేస్తున్నట్టుగా ఆయన సలహాదారు చెప్పారని కథనం పేర్కొంది. కాగా ఇజ్రాయిల్ ఇప్పటికే గాజాలో హమాస్ లక్ష్యంగా కొన్ని నెలలుగా దాడులు చేస్తోంది. ఆ యుద్ధానికి ఎలాంటి ముగింపు లేకుండా పోరాడుతున్న సమయంలోనే తాజాగా ఇరాన్‌తో తలపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సిరియాలోని డమాస్కస్‌లో ఉన్న ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇటీవల దాడి జరిగింది. ఈ ఘటనలో ఇరాన్ ఉన్నతస్థాయి జనరల్, ఆరుగురు సైనికులతో పాటు మొత్తం 13 మంది చనిపోయారు. ఈ దాడి ఇజ్రాయిలే చేసిందని, ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ శపథం చేసింది. అయితే ఈ దాడి తామే చేశామని ఇజ్రాయిల్ ఇప్పటివరకు ప్రకటించలేదు. ఈ దాడితో తమకు సంబంధం లేదని చెబుతోంది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మిలిటెంట్ గ్రూపులకు మద్దతునిచ్చిన ఇరాన్ సైనిక అధికారులను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకుందని ఇరాన్ ఆరోపిస్తోంది. కాగా యుద్ధ మేఘాలు అలుముకున్న వేళ ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలకు వెళ్లొద్దని భారత్, అమెరికాతో పాటు అనేక దేశాలు తమ పౌరులకు అడ్వైజరీ జారీ చేశాయి.

పవన్‌కు 'బకెట్' గుబులు!

(మొదటిపేజీ తరువాయి)

ఉండటం చర్చనీయాంశంగా మారింది. జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాల్లో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పటికే బీ ఫామ్‌లనూ వారికి అందజేసింది. నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం బకెట్ గుర్తు కేటాయించింది. ఈ బకెట్ గుర్తుతో పోటీ చేయవద్దని తనకు జనసేన నేతల నుంచి బెదిరింపులు వస్తున్నాయంటూ ఆ పార్టీ నేత షేక్ జలీల్ ఆరోపించారు. రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఆయన ఫిర్యాదు చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంలో నవరంగ్ కాంగ్రెస్ తరపున (బకెట్ గుర్తు)పై కె.పవన్ కల్యాణ్ అనే అభ్యర్థిని నిలిపారు.

తెనాలిలో నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తున్న స్థానంలో నవరంగ్ కాంగ్రెస్ తరపున బకెట్ గుర్తుపై ఎన్.మనోహర్ అనే అభ్యర్థిని బరిలోకి దించారు. అనకాపల్లి అసెంబ్లీకి కొణతల రామకృష్ణ పేరుతోను అభ్యర్థిని ప్రకటించారు. మచిలీపట్నం జనసేన ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి ఉండగా, అక్కడ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ బకెట్ గుర్తుతరపున బాలశౌరి పేరుతో మరో అభ్యర్థిని దించారు. దీంతో జనసేన గుర్తు గాజు గ్లాసు, దానిని పోలిన నవరంగ్ కాంగ్రెస్‌కు చెందిన బకెట్ గుర్తు ఒకేలా ఉండటం చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలతో తప్పనిసరిగా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని జనసేన నేతలు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక ముందు నవరంగ్ కాంగ్రెస్ నేత జలీల్‌కు జనసేన నేతల నుంచి బెదిరింపులు వచ్చినట్లు ఆయన చెబుతున్నారు. ఈ బకెట్ గుర్తును నవరంగ్ కాంగ్రెస్‌కు రావడంతో ఆ పార్టీ నేత ఆనందం వ్యక్తం చేస్తుండగా, జనసేన నేతలు ఆందోళనకు గురవుతున్నారు.

కేసుల వివరాలకు జాప్యం ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. మార్చి ఒకటో తేదీన డీజీపీకి లేఖ రాసినప్పటికీ ఈరోజు వరకు వివరాలు ఇవ్వకపోవడంపై సీనియర్ న్యాయవాది దమ్మాల పాటి శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై కేసులకు సంబంధించి నేటి వరకు వివరాలు ఇవ్వలేదని కోర్టు దృష్టికి శ్రీనివాస్ తీసుకొచ్చారు. ఫాం7లో కేసుల వివరాలు తప్పనిసరిగా పొందుపరచాల్సిన అవసరం నామినేషన్ల నిబంధనలో ఉందని న్యాయవాదులు దమ్మాలపాటి, ఉమేష్ చంద్ర, వి.వి.సతీష్ కోర్టుకు తెలియజేశారు. కేసుల వివరాలు పొందుపర్చకపోతే నామినేషన్లు తిరస్కరించే అవకాశం ఉందని న్యాయవాదులు వివరించారు. ఈనెల 18 నుంచి నామినేషన్లు ప్రారంభమై 25తో ముగుస్తాయని, అందువల్ల వెంటనే వివరాలు ఇవ్వాలని న్యాయవాదులు కోరారు. ఈ సమాచారం మొత్తాన్ని ఇవ్వాలంటే డీజీపీ కార్యాలయానికి ఇబ్బంది అవుతుందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. గతంలో రఘురామకృష్ణరాజుపై ఉన్న కేసుల వివరాలను డీజీపీనే ఇచ్చారన్న విషయాన్ని ఈ సందర్భంగా న్యాయవాది ఉమేష్ చంద్ర గుర్తుచేశారు. కేసుల వివరాలు ఇవ్వడానికి ఉన్న ఇబ్బందులు ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించారు. అవసరమైతే నలుగురు అధికారులను నియమించి వెంటనే కేసుల వివరాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. డీజీపీని అడిగి దీనిపై పూర్తి వివరాలు కోర్టుకు తెలపాలని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను 16కు వాయిదా వేసింది.

దస్తగిరి పిటిషన్‌పై 29న సీబీఐ కోర్టు తీర్పు

వివేకా హత్య కేసులో తనను సాక్షిగా పరిగణించాలంటూ అప్రూవర్‌గా మారిన దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ కోర్టు విచారణ చేపట్టింది. కోర్టుకు శుక్రవారం హాజరుపై ఎంపీ అవినాశ్ రెడ్డి, దస్తగిరి మినహాయింపు తీసుకున్నారు. ఈ కేసులో మిగతా నిందితులు హాజరయ్యారు. దస్తగిరిని సాక్షిగా పరిగణించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని న్యాయస్థానానికి సీబీఐ తెలిపింది. వాదనలు ముగించిన న్యాయస్థానం తీర్పును ఈనెల 29కి వాయిదా వేసింది.

ఇంటర్ ఫలితాల్లో బాలికల సత్తా

(మొదటిపేజీ తరువాయి)



కార్యాలయంలో శుక్రవారం అధికారులతో కలిసి కార్యదర్శి సౌరబ్ గౌర్ ఫలితాలను వెల్లడించారు. ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులు 67 శాతం, ద్వితీయ జనరల్ విద్యార్థులు 78 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర జనరల్ బాలికలు 71 శాతం, బాలురు 64 చొప్పున ఉత్తీర్ణతా శాతం నమోదయింది. ఇంటర్ ద్వితీయ సంవత్సర జనరల్ బాలికలు 81 శాతం, బాలురు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఉత్తీర్ణతా శాతంలో బాలుర కంటే బాలికలే పైచేయిగా నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో కృష్ణాజిల్లా (84 శాతం) మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానం గుంటూరు జిల్లా (81 శాతం), మూడో స్థానం ఎన్టీఆర్ జిల్లా (79 శాతం) కైవసం చేసుకున్నాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో మొదటి స్థానాన్ని కృష్ణాజిల్లా (90 శాతం) నిలిచింది. రెండో స్థానం గుంటూరు జిల్లా (87 శాతం) ఫలితాలను సాధించింది. మార్చి 1వ తేదీ నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,559 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలను నిర్వహించారు. అనంతరం మార్చి 18 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు మూల్యాంకనం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన 22 రోజులకే వేగవంతంగా ఫలితాలను ప్రకటించారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్, ప్రైవేట్ విభాగాలకు చెందిన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం 10,02,150 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్ జనరల్ ప్రథమ సంవత్సర విద్యార్థులు మొత్తం 4,61,273 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 3,10,875 మంది (67 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,93,757 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 3,06,528 మంది (78 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 38,483 మంది పరీక్షలకు హాజరుకాగా, వారిలో 23,181 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 32,339 మంది పరీక్షలకు హాజరుకాగా, వారిలో 23,000 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను మే 24 నుంచి జులై 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులు ఆందోళన వద్దు : సౌరభ్ గౌర్

ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులుకాని విద్యార్థులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ సూచించారు. వాళ్లంతా మనోధైర్యంగా ఉండాలని, మే 24 నుంచి నిర్వహించబోయే సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధపడాలని కోరారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను మందలించవద్దని చెప్పారు. సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కూడా రెగ్యులర్ విద్యార్థుల తరహాగానే మార్కుల జాబితా ఉంటుందని, ఎక్కడా సప్లిమెంటరీ అనే పదం ఉండబోదని స్పష్టం చేశారు. పరీక్షా ఫలితాలు 22 రోజుల్లోనే విడుదల చేసిన బోర్డు సిబ్బందికి, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 18 నుంచి 24 వరకు రీ వాల్యుయేషన్‌కు అవకాశం కల్పించామన్నారు.

గోపీచంద్ తోటకూరకు అరుదైన అవకాశం

అంతరిక్షంలోకి వెళ్లనున్న తొలి తెలుగువాడు

న్యూఢిల్లీ: అంతరిక్షంలోకి వెళ్లే తొలి తెలుగు వ్యక్తిగా గోపీచంద్ తోటకూర రికార్డు సృష్టించబోతున్నారు. ఈ విషయాన్ని 'బ్లూ ఆరిజిన్' ఇటీవల వెల్లడించింది. ఈ సంస్థ చేపట్టిన 'న్యూ షెపర్డ్' ప్రాజెక్టులో గోపిచంద్ పర్యాటకుడిగా వెళ్లనున్నారు. 1984లో రాకేశ్ శర్మ అంతరిక్షయానం చేసిన విషయం తెలిసిందే. కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్, రాజాచారి, శిరీష బండ్ల తదితరులు భారత మూలాలున్న అమెరికా పౌరులు. భారత తొలి స్పేస్ టూరిస్ట్‌గా తాజాగా గోపీచంద్ చరిత్ర సృష్టించనున్నారు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉంటున్నప్పటికీ భారత పాస్‌పోర్టు కలిగి ఉన్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు, బిలియనీర్ జెఫ్ బెజోస్‌కు చెందిన అంతరిక్ష సంస్థే బ్లూ ఆరిజిన్. ఈ కంపెనీ ఇప్పటికే న్యూ షెపర్డ్ మిషన్ పేరిట అంతరిక్ష యాత్రలకు శ్రీకారం చుట్టింది. 2021లో బెజోస్ సహా ముగ్గురు పర్యటకులు రోదసీయాత్ర చేశారు. తర్వాత చేపట్టబోయే ఎన్ఎస్-25 మిషన్‌కు గోపీచంద్ సహా మొత్తం ఆరుగురిని ఎంపిక చేశారు. వెంచర్ క్యాపిలిస్ట్ మాసన్ ఏంజెల్, ఫ్రాన్స్ ఔత్సాహిక పారిశ్రామికవేత్త సిల్వైన్ చిరోన్, అమెరికా టెక్ వ్యాపారి కెన్నెత్ ఎల్ హెస్, సాహసయాత్రికుడు కరోల్ షాలర్, అమెరికా వైమానికదళ మాజీ కెప్టెన్ ఎడ్ డ్వైట్ ఎన్ఎస్-25లో ప్రయాణించనున్నారు. డ్వైట్ 1961లో అంతరిక్షయానానికి ఎంపికైన తొలి నల్లజాతి వ్యోమగామి. కానీ, వివిధ కారణాల వల్ల ఆయనకు రోదసీలోకి వెళ్లే అవకాశం ఇప్పటి వరకు రాలేదు. విజయవాడలో పుట్టిన గోపీచంద్ తోటకూర.. ప్రిజర్వ్ లైఫ్ సంస్థ సహ-వ్యవస్థాపకుడిగా ఉన్నారు. అట్లాంటా శివారులో మిలియన్ల డాలర్లతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఒక వెల్‌నెస్ సెంటర్. గోపీచంద్ పైలట్‌గానూ శిక్షణ పొందారు. పదేళ్ల క్రితం భారత్‌లో మెడికల్ ఎయిర్-ఎవాక్యుయేషన్ సేవల్లో పనిచేశారు. బ్లూ ఆరిజిన్ అధికారికంగా ప్రకటించే వరకు తన కుటుంబానికి సైతం ఈ విషయం తెలియదని ఎకనామిక్ టైమ్స్‌తో మాట్లాడుతూ గోపీచంద్ వెల్లడించారు. ఎనిమిదేళ్ల వయసులోనే అంతరిక్షంపై ఆసక్తి కలిగిందని తెలిపారు. 'ఎంబ్రీ-రిడిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీ' నుంచి ఏరోనాటికల్ సైన్స్‌లో బీఎస్సీ పూర్తి చేశారు.

రైతును మోసగించే మిల్లర్లపై కఠిన చర్యలు

ధాన్యం కొనుగోళ్లు, తాగునీటిపై సీఎం రేవంత్ సమీక్ష

విశాలాంధ్ర-హైదరాబాద్: రైతులు అమ్ముకునే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం తన కార్యాలయంలో శుక్రవారం పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై సమీక్షించారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల లైసెన్సులను రద్దు చేయాలని, కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీఎం ఆదేశించారు. కొన్ని చోట్ల తేమ ఎక్కువగా ఉందని చెప్పి వ్యాపారులు, మిల్లర్లు ధరలో కోత పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అందుకే ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని ముఖ్యమంత్రి రైతులకు విజ్ఞప్తి చేశారు. నేరుగా కళ్లాల నుంచి వడ్లను మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ఒకటి రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లోనే తగిన ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వడ్ల దొంగతనం జరుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఏ రోజుకారోజు రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు పలు జిల్లాలకు వెళ్లి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరాకు ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సూచించారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల టైమ్ కావటంతో కొన్ని చోట్ల రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషనుకు ఫిర్యాదు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా రాబోయే రెండు నెలలు మరింత కీలకమని సీఎం అప్రమత్తం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఎక్కువ నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలకు సరిపోవటం లేదని గుర్తు చేశారు. అప్పటి కంటే భూగర్భ జల మట్టం పడిపోవటంతో ప్రజలు కేవలం నల్లా నీటిపైనే ఆధారపడటంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఫిర్యాదు వచ్చినా వెంటనే అక్కడ తాగునీటి సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సూచించారు. ఏ రోజుకారోజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు తాగునీటి ఇబ్బందులున్న చోటికి స్వయంగా వెళ్లి పరిశీలించాలని, అక్కడ సమస్యను పరిష్కరించే చర్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా, మరింత డిమాండ్ పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని హైదరాబాద్ తెచ్చుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

ఇటు సింగూర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్నాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సీఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒకచోట తాగునీటి సరఫరా నిలిచి పోయిందని సీఎం దృష్టికి వచ్చింది. ఉద్దేశ పూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కల్పించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అకారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

అవినాశ్ రెడ్డిని ఓడిస్తా

(మొదటిపేజీ తరువాయి)

చేశానన్నారు. జగనన్న జైలులో ఉన్న సమయంలో తాను సుమారు 3,200 కిలోమీటర్లు పాదయాత్ర చేశానని, సమైక్యాంధ్ర ఉద్యమంలో కూడా చురుగ్గా పాల్గొన్నట్లు గుర్తు చేశారు. ఇదంతా జగనన్న కోసమే చేసినట్లు చెప్పారు. అయితే జగన్ ముఖ్యమంత్రి అయితే తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలు నెరవేరుతాయని రాష్ట్ర ప్రజలు భావించారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞ ప్రదాతగా పేరుగాంచారన్నారు. కానీ ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్సార్ ఆశయాలకు తిలోదకాలిచ్చారని విమర్శించారు. కనీసం ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తయిన దాఖలాలు లేవన్నారు. చిన్నాన్న వివేకా హత్య గురించి మొదట తమకేమీ అర్థం కాలేదని, ఎలా జరిగిందన్న అంశం అంతు చిక్కలేదన్నారు. ఆ తర్వాత సీబీఐ విచారణలో వెలుగు చూసిన నిజాలను చూసి తాము ఆశ్చర్యపోయామన్నారు. విచారణలో హత్య చేసిన వారి వివరాలు, చేయించిన వారి వివరాలు గుగూల్‌లో సరిపోలడంతో అసలు విషయం తెలిసిందన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక తనకు ఆ ఇంటితో పరిచయాలు కూడా పూర్తిగా తగ్గిపోయాయన్నారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు పూర్తయినా ఇంత వరకు హత్య చేయించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అవినాశ్ రెడ్డే హత్య చేయించాడని సీబీఐ అధికారులు, ప్రజలు అనుకుంటుంటే సీఎం జగన్ మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ హంతకులకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఆడబిడ్డలు న్యాయం కోసం మీ వద్దకు వస్తే ఛీఫో అని తరిమివేశారని అన్నారు. నా అక్కచెల్లెమ్మలు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. షర్మిల ఒక ఆయుధమై మీ వైసీపీని కూకటివేళ్లతో పెకిలించే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. పేదలకు న్యాయం చేస్తామని బస్సు యాత్ర చేస్తున్నది ప్రజల చెవిలో పూలు పెట్టడానికేనా అని అన్నారు. మీ చేష్టలు, సినిమా నాటకాలు చూపిస్తూ ప్రజలను నమ్మిస్తున్నారని తెలిపారు. ప్రజలారా మీరే న్యాయ నిర్ణేతలు... మంచి, చెడు ఆలోచించి ధర్మం కావాలా లేక డబ్బుతో మదమెక్కిన జగన్ కావాలా లేక రాజశేఖర్‌రెడ్డి బిడ్డ కావాలా మీ ముందుకు చేతులు చాచి అర్థిస్తూ మీ వద్దకు వచ్చానన్నారు. ఆలోచించండి మీ పదునైన ఓటుతో జగన్, అవినాశ్ రెడ్డికి బుద్ధి చెప్పాలని షర్మిలా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

హంతకులకు టికెట్ ఇచ్చి ఓటు అడగటం న్యాయమా : ఓబులేసు

మాజీ మంత్రి వివేకా హత్య కేసులో హంతకులుగా అభియోగం ఎదుర్కొంటున్న వారికి టికెట్ ఇచ్చి ఓటు అడగటం న్యాయమా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పులివెందుల పట్టణానికి విచ్చేసిన ఆయన బస్సు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం జగన్‌ను ఉద్దేశించి సొంత చెల్లెమ్మలకు అన్యాయం జరుగుతుంటే మీరు మాత్రం హంతకులకు సీటు కేటాయించి ప్రజలను ఓటు అడుగటం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. పులివెందులలో కడప లోక్‌సభ అభ్యర్థిని షర్మిలమ్మ సమావేశానికి వచ్చిన అశేష జనవాహిని చూసి తెలివి తెచ్చుకుని షర్మిలమ్మకు మద్దతు పలికితే ప్రజలు అంగీకరిస్తారన్నారు. లేనిపక్షంలో జనసంద్రంలో కొట్టుకుని పోయే రోజులు దగ్గరలో ఉన్నాయని హితవు పలికారు. సొంత నియోజకవర్గానికి ఒక్క ప్రాజెక్టుగానీ, రైతులకు సాగునీరుగానీ ఇవ్వలేకపోతున్నావని విమర్శించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటూ కమ్యూనిస్టుల నిరంతర పోరులో ప్రభుత్వ వ్యతిరేకతను మీ దృష్టికి ఎన్నోమార్లు తీసుకొచ్చినా బుద్ధి మాత్రం మారలేదన్నారు.

సొంత నియోజకవర్గానికి, సొంత చెల్లెమ్మలకు న్యాయం చేయలేని నీవు ప్రజలకు ఏమీ న్యాయం చేస్తామని ప్రశ్నించారు. ఇదంతా చూస్తున్న ప్రజలు ఓటుతోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

దేశంలో మార్పు అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

జీవించాలని 70 శాతం మంది కోరుకుంటున్నట్లు తెలిపారు. పదేళ్ల కాలంలో రూ.155 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోదీ దేశ ప్రజలపై మోపారన్నారు. మోదీ మరోసారి ప్రధాని అయితే రాజ్యాంగాన్ని మార్చివేస్తారని, లౌకికవాదం పేరు కూడా వినపడదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వలంటీర్లపై చర్చకు పరిమితమవ్వడం శోచనీయమన్నారు.

రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు తదితర ప్రధాన అంశాలపై చర్చ జరగకపోవడం దారుణమన్నారు. ఓట్ల కోసం దిగజారుడు రాజకీయాలు చేస్తున్న పార్టీలు తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు కూడా లేని బీజేపీకి ఆరు ఎంపీ స్థానాలు ఎలా కేటాయించారని కూటమి పెద్దలను నిలదీశారు.

రాజ్యాంగ రక్షణకు బీజేపీని సాగనంపాలి: శ్రీనివాసరావు

దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడుకోవాలన్నా... రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నా బీజేపీని సాగనంపడం ఒక్కటే మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అభివృద్ధి మంత్రంతో 2014 ఎన్నికల్లో గద్దెనెక్కిన బీజేపీ... ప్రజలను భావోద్వేగాల వైపు మళ్లించి 2019లోనూ అధికారం చేపట్టిందని గుర్తుచేశారు. రామరాజ్యం పేరుతో 2024లో మళ్లీ గద్దెనెక్కాలని చూస్తుందని, ఈసారి మోదీ గెలిస్తే 2029 ఎన్నికలు ఉండవని హెచ్చరించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడంలో నరేంద్ర మోదీ బాధ్యత, చంద్రబాబు కపటత్వం ఉందని విమర్శించారు. వైసీపీది సంక్షేమ రాజ్యం కాదు... క్షామ రాజ్యమని, టీడీపీది సూపర్-6 కాదు... చీటింగ్-6 అంటూ మండిపడ్డారు. ప్రజల హక్కుల కోసం పోరాడే రాజ్యం కావాలో... చీటింగ్-6, క్షామ రాజ్యం కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మహిళలపై రాజకీయాలు చేస్తూ...అసభ్యకరంగా వ్యవహరిస్తున్న వైసీపీ, టీడీపీలకు ఆత్మగౌరవం గల ఏ మహిళా ఓటు వేయదన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడుతున్న పార్టీలు కమ్యూనిస్టు పార్టీలని అన్నారు. ప్రజలపై భారాలు మోపుతూ ప్రజాస్వామ్య విలువలు గాలికి వదిలేసి, స్వార్థ రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దాని పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు.

కుల, మత రాజకీయాలు మంచిది కాదు: మస్తాన్‌వలి

కులం, మతం పేరుతో చేస్తున్న రాజకీయాలు దేశానికి మంచిది కాదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. పెరుగుతున్న ధరలపై మాట్లాడలేని పిరికిపంద ప్రధాని మోదీ అని విమర్శించారు. పదేళ్ల కాలంలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు.. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు... మహిళా సాధికారతకు మీరు చేసిందేమిటి, జాతి సంపదను పెంచారా అని నిలదీశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ దేశ సంపదను బడాకార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మోదీకి సలాం కొట్టే పనిలో మునిగిపోయారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని చెబుతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్... ఆ ప్రయోజనాలేమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీని గద్దెదించడమే లక్ష్యం: ముప్పాళ్ల

బీజేపీని, నరేంద్ర మోదీని గద్దెదించడమే దేశం ముందున్న అతిపెద్ద సవాల్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఇది కేవలం ఇండియా కూటమి పార్టీల అజెండా మాత్రమే కాదని, దేశ ఐక్యతను కోరుకునే ప్రతిఒక్కరిదని స్పష్టం చేశారు. బీజేపీ దుర్మార్గాన్ని, దానితో దేశానికి జరుగుతున్న నష్టాన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఆప్ తరహా ప్రచారంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఇండియా గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ 2024 ఎన్నికలను ప్రజా సేవకులకు, కార్పొరేట్ శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటంగా అభివర్ణించారు. కుల, మత వైషమ్యాలు లేని, ఆర్థిక దోపిడీ లేని నూతన సమాజం కోసం ఇండియా కూటమి గెలవాలని అన్నారు. ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు జొన్నా శివశంకర్(మంగళగిరి), కొరివి వినయ్‌కుమార్(ప్రత్తిపాడు), జక్కా రవీంద్రనాథ్ (పొన్నూరు), చిలకా విజయ్‌కుమార్(తాడికొండ) ప్రసంగించారు. ప్రచార కరపత్రాలను రామకృష్ణ ఆవిష్కరించారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు అందరినీ ఆలోచింపజేశాయి. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అతిథులకు స్వాగతం పలకగా...సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ వందన సమర్పణ చేశారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటన్ కుటుంబ వీసా కఠినతరం

వేతన పరిమితి 55 శాతం పెంపు

లండన్: వలసలను అడ్డుకునేందుకు బ్రిటన్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయాన్ని అమల్లోకి తెచ్చింది. కుటుంబ వీసా నిబంధనలను మరింత కఠినతరం చేసింది. బ్రిటిష్ పౌరులు, శాశ్వత నివాసితులు (భారత వారసత్వం ఉన్నవారితో సహా) తమ బంధువులను కుటుంబ వీసాపై తీసుకురావాలనుకుంటే అందుకు కనీస వార్షిక వేతన పరిమితిని ఏకంగా 55 శాతం పెంచింది. దీన్ని యూకే సర్కారు గతేడాదే ప్రకటించగా గురువారం నుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. ఇక నుంచి ఎవరైనా కుటుంబ వీసాకు స్పాన్సర్ చేయాలంటే... వారి కనీస వార్షిక వేతనం 29,000 జీబీపీ (గ్రేట్ బ్రిటన్ పౌండ్)లుగా ఉండాలని యూకే ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఈ పరిమితి 18,600 జీబీపీలుగా ఉండగా... ఇప్పుడు దాన్ని 55 శాతం పెంచారు. అంతేకాదు, వచ్చే ఏడాది నుంచి వృత్తి నిపుణుల వీసా నిబంధనలతో సమానంగా కుటుంబ వీసాల కోసం వేతన పరిమితిని 38,700 పౌండ్లకు పెంచనున్నట్లు అధికారులు వెల్లడించారు. "దేశంలోకి వలసలు విపరీతంగా పెరుగుతున్న వేళ ఇంతకంటే సులభమైన పరిష్కారం మాకు కన్పించలేదు. చట్టపరమైన వలసలతో యూకేలోని పన్ను చెల్లింపుదారులపై భారం పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని బ్రిటన్ హోం మంత్రి జేమ్స్ క్లెవర్లీ తెలిపారు. ఉపాధి వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ గతేడాది డిసెంబరులోనే యూకే సర్కారు హౌస్ ఆఫ్ కామన్స్‌లో బిల్లును ప్రవేశపెట్టింది. దాని ప్రకారం... కుటుంబ వీసా కోసం వేతన పరిమితిని 38,700 డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. అయితే, దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రధాని రిషి సునాక్ ప్రభుత్వం కాస్త వెనక్కి తగ్గింది. రెండు దశల్లో ఈ పెంపును అమలు చేస్తామని ప్రకటించింది. ఈ కఠిన నిబంధనలవల్ల ప్రస్తుత వలసల్లో మూడు లక్షల మంది వరకూ తగ్గుతారని అప్పట్లో మంత్రి క్లెవర్లీ వెల్లడించారు. కాగా, ఈ పెంపుతో భారతీయులపైనే అధిక ప్రభావం పడనుంది.

సీబీఐ కస్టడీకి కవిత

(మొదటిపేజీ తరువాయి)

అడుగుతోందని కవిత తెలిపారు. సీబీఐది వృథా ప్రయాస అని, చెప్పడానికి ఏమీ లేదని, సీబీఐ తప్పుడు మార్గంలో వెళుతుందోని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు తీహార్ జైలు నుంచి రౌస్ ఎవెన్యూ స్పెషల్ కోర్టుకు కవిత చేరుకున్నారు. జడ్జి ముందు కవితను సీబీఐ ప్రవేశపెట్టింది. ఐదు రోజుల కస్టడీ సీబీఐ కోరింది. కవితను విచారించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని కోర్టుకు సీబీఐ తెలిపింది. కవిత సీబీఐ కస్టడీపై తీర్పును రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి రిజర్వ్ చేశారు. అరెస్టు, రిమాండ్‌పై వాదనలను మధ్యాహ్నం 2 గంటల తర్వాత వింటామని జడ్జి తెలిపారు. దీంతో కవితను కోర్టు గది నుంచి అధికారులు తీసుకువెళ్లారు. అనంతరం మధ్యాహ్నం వాదనలు విన్న న్యాయమూర్తి కవితను సీబీఐ కస్టడీకి ఇస్తూ తీర్పు వెలువరించారు. ఇదిలాఉండగా, గురువారం తీహార్ జైల్లో ఉన్న కవిత అరెస్టు చేస్తున్నట్లు సీబీఐ ప్రకటించింది. సీబీఐ అరెస్ట్‌ను సవాలు చేస్తూ కోర్టులో కవిత పిటిషన్ వేశారు. ఎటువంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా సీబీఐ అరెస్ట్ చేసిందని కవిత తరపు న్యాయవాది పేర్కొన్నారు.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించిన నాటి నుంచి అధికారులు సమావేశాలకు హాజరుకావడం మానేశారని వివరించారు. ఈ కుట్రలో భాగంగానే సీఎం వ్యక్తిగత కార్యదర్శి(పీఎస్)ని పదవి నుంచి తొలగించారని ఆమె చెప్పారు. ఢిల్లీలో అధికారం చేపట్టే అవకాశాలు లేవని బీజేపీకి స్పష్టంగా తెలుసున్నారు. 2015, 2020లో బీజేపీని ఆప్ చిత్తుచిత్తుగా ఓడించిందని గుర్తుచేశారు. పూర్తి మెజారిటీ ఉన్నా ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న అసెంబ్లీలో తమ బలాన్ని నిరూపించుకున్నామన్నారు. కాగా, ఈ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. ఆప్ కొన్ని ప్రతిరోజు కొన్ని అందమైన కథలను వండి వార్చుతుందని ఎదురుదాడికి దిగింది. ఇదిలా ఉంటే... మద్యం విధానానికి సంబంధించిన కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అవినీతి ఆరోపణలు చేస్తూ ఒక మంత్రి రాజీనామా చేయగా... సీఎం పీఎస్ వైభవ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించారు. అతడి నియామక ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ విభాగం ప్రకటించింది.

ఓట్లు, సీట్ల కోసం తాపత్రయం

ప్రజలకు మంచి చేద్దామని ప్రభుత్వానికి లేదు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఓట్లు, సీట్ల కోసం తప్ప కార్మికులకు, ప్రజలకు మేలు చేద్దామన్న ఆలోచన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వానికి ఏ కోశానా లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని కొవ్వూరు గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.నాగసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, బాలకాశీ, ఏఐటీయూసీ పట్టణ నాయకులు హరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ దేశంలో సంపదను సృష్టించి, వ్యవస్థలను నడిపే కార్మిక వర్గం 50 కోట్ల మంది ఉన్నారన్నారు. అసంఘటిత రంగంలో 46 కోట్ల మంది కార్మికులుండగా, సంఘటిత రంగంలో 4 కోట్ల మంది కార్మికులు పనిచేస్తూ సంపదను సృష్టిస్తుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారీ, కార్పొరేట్ వ్యవస్థలను పెంచి పోషిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ పెట్టుబడి దారులు 16.50 కోట్ల రూపాయల రుణాలు బ్యాంక్‌లకు ఎగనామం పెడితే ఆయా వ్యవస్థలకు ప్రభుత్వాలు రాయితీ కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తప్ప అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశాము.... తిరిగి అధికారంలోకి వస్తే ఏమి చేస్తాం అని చెప్పడంలో పార్టీలు విఫలం చెందాయన్నారు. బీజేపీకి పూర్తిగా మద్దతు తెలుపుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఒకపక్క ఉమ్మడి మేనిఫెస్టోను ప్రకటిస్తుంటే, జగన్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తుంటే పాలక ప్రభుత్వం అడ్డుకోకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు పొత్తులో అసెంబ్లీలో అడుగుపెట్టాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కొనసాగిస్తాం, గంగవరం పోర్టును యధావిధిగా కొనసాగించే ప్రయత్నం చేస్తామని పాలక, ప్రతిపక్ష పార్టీలు చెప్పకపోవడం వింతగా ఉందన్నారు. ప్రజలకు మాయమాటలు చెబుతూ ప్రాంతాల వారీగా, కులాలవారీగా విడగొట్టి అధికారంలోకి రావాలనే ప్రయత్నాలు తప్ప మేలు చేసే ఆలోచన జగన్‌కుగానీ, చంద్రబాబుకుగానీ లేదని విమర్శించారు. ఎన్‌డీఏ కూటమికి వ్యతిరేకంగా, అలాగే వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న జగన్‌కు వ్యతిరేకంగా కార్మికులు కదం తొక్కాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటే రాష్ట్ర పరిస్థితి బాగాలేదని చెబుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ... తిరిగి అధికారంలోకి వస్తే ఆలోచిస్తామని చెప్పడం ఉద్యోగులను మోసగించడమే అన్నారు. హమాలి, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, స్ట్రీట్ వెండర్లకు సంబంధించిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు, అంగన్‌వాడీలకు, మధ్యాహ్న భోజనం పథకంలో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీడీపీ, బీజేపీ కీలక నేతలు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: తెలుగుదేశం, బీజేపీల నుంచి వివిధ జిల్లాల కీలక నేతలు సీఎం వైఎస్ జగన్ సమక్షంలో శుక్రవారం వైసీపీలో చేరారు. పల్నాడు జిల్లా ధూళిపాళ్ల నైట్ స్టే పాయింట్ వద్ద ఆలూరు, కోడుమూరు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, బీజేపీ నేతలకు జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఆలూరు నియోజకవర్గ నేత, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మసాల పద్మజ, టీడీపీ కోడుమూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి వైసీపీలో చేరారు. టీడీపీ కోడుమూరు నియోజకవర్గ కీలక నేత కోట్ల హరిచక్రపాణిరెడ్డి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ నాయకులు, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్, ఆలూరు నియోజకవర్గ నేత కురువ శశికళ దంపతులు, ఆంధ్రప్రదేశ్ కురవ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణమోహన్ జగన్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. వైసీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అభ్యర్థి బీ విరూపాక్షి, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు అభ్యర్థి ఆదిమూలపు తదితరులు ఉన్నారు.

కేఎల్ వర్సిటీకి ఐఎస్‌ఓ గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సుస్థిరత, సమర్థవంతమైన వనరుల నిర్వహణపై నిబద్ధత కలిగిఉన్నందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఐఎస్ఓ 14001:2015, ఐఎస్ఓ 50001:2018 గుర్తింపు పొందిందని వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది తమ వర్సిటీకి ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. పర్యావరణ నిర్వహణ వ్యవస్థల కోసం, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ సర్టిఫికేషన్‌ల విషయంలో గుర్తింపు సాధించడం గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల తగ్గింపు, వనరుల సంరక్షణ కోసం సమర్థవంతమైన వ్యూహాలను అమలుపరుస్తున్న అంశాలు ఐఎస్ఓ గుర్తింపునకు కారణాలుగా పేర్కొన్నారు. తమ వర్సిటీ సిస్టమాటిక్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ పద్ధతులను పాటిస్తుందన్నారు. ఇది శక్తి వినియోగం, ఖర్చు ఆదా, మరింత స్థిరమైన శక్తి నిర్వహణకు నిదర్శనమన్నారు. సమగ్ర హరిత, పర్యావరణం, శక్తి ఆడిట్ తర్వాత ఈ ప్రతిష్టాత్మక ధృవపత్రాలు అందించబడ్డాయని అన్నారు. ఇటీవల వర్సిటీ ప్రాంగణంలో జరిగిన సర్టిఫికేషన్ వేడుకకు డీన్‌లు, అధ్యాపకులు హాజరయ్యారని వివరించారు. వీసీలు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సీఈవో ముకేశ్‌కుమార్ మీనా

విశాలాంధ్ర - తిరుపతి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా మార్గదర్శకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందస్తు తనిఖీల్లో భాగంగా తిరుపతి శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో శుక్రవారం స్వీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ఆయన కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్, ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్, జేసీ ధ్యానచంద్ర, మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్, వీసీ భారతి, రిజిస్ట్రార్ రజనిలతో కలిసి ప్రారంభించారు. ఓటు విలువ ప్రాముఖ్యతను వివరిస్తూ 'ఓటు వేద్దాం... ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం' అంటూ విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటో దిగి, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నదని, నామినేషన్‌ల ప్రక్రియ 25తో ముగుస్తుందని, మే 13 న ఎన్నికలు జరుగనున్నాయని వివరించారు. 35 వేల ఎపిక్ కార్డులు అన్ ఆథరైజ్డ్‌గా డౌన్లోడ్ చేశారన్న అభియోగాలపై మీడియా ప్రతినిధులు వివరణ కోరగా... ఐఏఎస్ అధికారి మొదలుకొని మండల స్థాయి అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగిందని, కేసు విచారణలో ఉందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన సీఎం జగన్‌కు, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

నేడు విజయవాడకు 'మేమంతా సిద్ధం': తలశిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర శనివారం విజయవాడకు రానుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తలశిల రఘురామ్ తెలిపారు. 14వ రోజు బస్సుయాత్రలో భాగంగా జగన్ ఉదయం తొమ్మిది గంటలకు నంబూరు రాత్రి బస చేసిన చోటు నుంచి బయలుదేరుతారని వివరించారు. కాజ, మంగళగిరి బైపాస్ మీదుగా ఉదయం 11 గంటలకు సీకే కన్వెన్షన్ వద్దకు చేరుకుని చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారని, అనంతరం కుంచనపల్లి బైపాస్ మీదుగా తాడేపల్లి బైపాస్‌కు చేరుకొని భోజన విరామం తీసుకుంటారని చెప్పారు. అనంతరం వారధి, శిఖామణి సెంటర్, చుట్టుగుంట, భగత్‌సింగ్‌రోడ్, పైపుల రోడ్, కండ్రిక, రామవరప్పాడు, నిడమానూరు బైపాస్ మీదుగా కేసరపల్లి బైపాస్ శివారులో రాత్రి బస శిబిరానికి జగన్ చేరుకుంటారని పేర్కొన్నారు.

లోకేశ్ ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్‌కు యత్నం

సెక్యూరిటీ అలర్ట్ పంపిన యాపిల్ సంస్థ

డీజీపీ, ఇంటిలిజెన్స్ చీఫ్‌పై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్‌కు ప్రయత్నం జరుగుతోందని యాపిల్ సంస్థ ఆయనకు సెక్యూరిటీ అలర్ట్ పంపింది. లోకేశ్ ఈమెయిల్‌కూ ఆ సమాచారాన్ని పంపింది. దీనికి సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆయనకు సూచించింది. దీనిపై టీడీపీ నేతలు... లోకేశ్ ఫోన్‌ను వైసీపీ ప్రభుత్వమే ట్యాప్ చేస్తోందని ఆరోపించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. లోకేశ్ ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి రాజ్యసభ మాజీ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్ లేఖ రాశారు. 'గుర్తుతెలియని ఏజెన్సీల ద్వారా పెగాసస్ సాఫ్ట్‌వేర్ సాయంతో లోకేశ్ ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు ఐఫోన్ సందేశాలు వచ్చాయి. ఇలాంటి సందేశాలే 2024 మార్చిలో సైతం వచ్చాయి. రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అనేకమార్లు తమ దృష్టికి తీసుకువచ్చాము. రాష్ట్ర డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లు ఎన్‌డీఏ కూటమిలోని సభ్యులపై వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్లుగా ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి నియామకం ప్రకాష్ సింగ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధం. ఇక పీఎస్ఆర్ ఆంజనేయులు అధికార పార్టీకి తొత్తుగా పని చేస్తున్నారని ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల సాధారణ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారి స్థానాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించాలి' అని కనకమేడల కోరారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం లేకుండా చర్యలు

కేంద్ర ఎన్నికల పరిశీలకుడికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సామాజిక పింఛన్ల పంపిణీలో ఏప్రిల్ నెలలో జరిగిన జాప్యం ఫలితంగా 65 లక్షల మంది పింఛన్‌దారులు పడిన తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చే నెల పింఛన్ల పంపిణీ సజావుగా సాగడానికి వీలుగా సమర్థవంతమైన చర్యలు వెంటనే తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ కోరింది. ఈ మేరకు సంస్థ ఉపాధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల మాజీ ప్రధానాధికారి డా.నిమ్మగడ్డ రమేశ్ కుమార్ శుక్రవారం విశాఖలో కేంద్ర ఎన్నికల పరిశీలకుడు రామమోహన్ మిశ్రాతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అనేక అంశాలను, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తాము లేవనెత్తిన అంశాలను కేంద్ర ఎన్నికల పరిశీలకుడు సావధానంగా విన్నారని, త్వరితగతిన తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో జరిగిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులను పునరావృతం కానీయకుండా మే 1, 2 తేదీల్లోనే పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసేలా, లోటుపాట్లకు తావులేని విధంగా ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించేటట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తగు మార్గదర్శకాలు ఇవ్వాలని వారు కోరారు. కొందరు వలంటీర్లు రాజీనామాలు చేసి అధికార పార్టీ తరపున పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోవడానికి సంసిద్ధం అవుతున్నారని, అలా చేస్తే అది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందని, రాజీనామా చేసిన వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా అనుమతించరాదని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రతినిధులు ఎన్నికల పరిశీలకునికి విజ్ఞప్తి చేశారు.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా

విశాలాంధ్ర- సీతానగరం: శ్రీకాకుళం జిల్లా సీతానగరం మండలంలో ఏడుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను శుక్రవారం ఎంపీడీవోకు సమర్పించారు. పెదంకలం సచివాలయ పరిధిలోని కృష్ణరాయపురం గ్రామానికి చెందిన ఐదుగురు, పెదంకలంకు చెందిన ఇద్దరు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఇప్పటికే కాసాపేటకు చెందిన ఒక వలంటీర్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మండలంలో ఇప్పటి వరకు ఎనిమిదిమంది వలంటీర్లు రాజీనామా చేశారు. మిగిలిన వారిని కూడా రాజీనామా చేయాలని రాజకీయ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని, ఒకటి రెండు రోజుల్లో అందరూ రాజీనామా చేయడం ఖాయమని విశ్వసనీయ సమాచారం.

బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డిని ఓడించండి

గుజ్జుల ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-రాజంపేట: దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే బీజేపీ తరపున రాజంపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డిని చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి సీపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బుక్కే విశ్వనాథ్ నాయక్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవర అధ్యక్షతన ఇండియా కూటమి సమావేశం శుక్రవారం జరిగింది. గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశాన్ని మత, కుల ఉన్మాద రాజకీయాలకు నిలయంగా మార్చిందని విమర్శించారు. దేశాన్ని అప్పుల పాలు చేసిందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్త చేసిందని మండిపడ్డారు. పేదరికం, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయన్నారు. అందుకే బీజేపీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దింపాల్సిన అవసరం ఉన్నదని ఆయన చెప్పారు. ఇండియా కూటమికి మద్దతుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలు ప్రభుత్వ ఏర్పాటుకు మాత్రమే కాదని, దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ఈశ్వరయ్య తెలిపారు. అన్నిరకాలుగా అన్యాయం చేసిన బీజేపీతో టీడీపీ, జనసేన జత కట్టడం రాష్ట్రానికి అన్యాయం చేయడమేనన్నారు. సీపీఎం రాష్ట్ర సమితి సభ్యుడు చంద్రశేఖర్, సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాధాకృష్ణ, కృష్ణప్ప, మనోహర్ రెడ్డి, సాంబశివ, సిద్దిగల శ్రీనివాసులు, సుమిత్రమ్మ, జ్యోతి చిన్నయ్య, కోటేశ్వరరావు, సీపీఎం ఏరియా కార్యదర్శి చిట్వేల్ రవికుమార్, వామపక్ష నేతలు ఎమ్మెస్ రాయుడు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక, వ్యవసాయ సంఘాల అన్ని మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

మేధావులూ... మద్దతివ్వండి: రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: విజ్ఞులైన మేధావులు ఇండియా కూటమి బలపరుస్తున్న తమకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీపీఐ పత్తికొండ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరం తరం ఉద్యమాలు చేసే వారిని శాసనసభకు పంపాలని కోరారు. కర్నూలు జిల్లాలో వెనుకబడ్డ పత్తికొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టినట్టు చెప్పారు. కంకి కొడవలి గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజ నేయులు, జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, కృష్ణయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రంగ స్వామి, న్యాయవాదులు ఈరన్న, చంద్రశేఖర్ నాయుడు, నరసింహ ఆచారి, దామోదరచారి, బాలభాష, రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయండి: జాస్తి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థానిక సంస్థలకు కేంద్రం రెండో విడత విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.988 కోట్లు ఆయా ఖాతాలకు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు... పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కన్నబాబుకు తాడేపల్లిలోని కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నిధులు విడుదలై 20 రోజులు అవుతున్నా స్థానిక సంస్థలకు ఎందుకు జమ చేయలేదని నిలదీశారు. ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయి... ఏం చేశారు... ఎందుకు జాప్యం చేస్తున్నారని అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి సమస్యల ఉందని, సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బకాయిలు, శానిటేషన్, పెండింగ్ బిల్లులు చెల్లించలేక పంచాయతీలు దినావస్థలో ఉన్నాయని వివరించారు. తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే ఆయా ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

'స్వర్ణాంధ్ర సాకార యాత్ర' పేరుతో నేటి నుంచి బాలకృష్ణ ప్రచారం

విజయశాలాంధ్ర- విజయవాడ: ప్రముఖ సినీనటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శనివారం నుంచి 'స్వర్ణాంధ్ర సాకార యాత్ర' పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం రాయలసీమలో బాలకృష్ణ విస్తృతంగా పర్యటించనున్నారు.
ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్‌డీఏ కూటమి విజయం సాధించాలన్న పట్టుదలతో బాలకృష్ణ సైతం ఎన్నికల ప్రచారానికి సమాయత్తమయ్యారు. ఏప్రిల్ 19న హిందూపురం టీడీపీ అభ్యర్థిగా బాలకృష్ణ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నెల 25 నుంచి ఉత్తరాంధ్రలో ఆయన ప్రచారం చేస్తారు.

ఇసుక తెమ్మంటే శవాన్ని తెచ్చారు!

ఇంటి బేస్‌మెంట్ నింపుతుండగా బయటపడ్డ మృతదేహం

కంగుతిన్న కూలీలు

విశాలాంధ్ర-చీరాల: ఆదిలోనే అశుభం ఎదురైంది. శుభమా అంటూ ఇల్లు నిర్మాణానికి ఇసుక తోలిస్తే... శవం బయటపడడంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు లోనైన ఘటన బాపట్ల జిల్లా ఈపూరుపాలెం పంచాయతీ పరిధిలోని పద్మనాభునిపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కాగితాల లక్ష్మి అనే మహిళ పద్మనాభునిపేటలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టింది. బేస్‌మెంట్ లెవల్లో నిర్మాణం పూర్తయింది. అయితే ఇంటి బేస్ మట్టం ఇసుకతో నింపేందుకు ట్రాక్టర్ డ్రైవర్లను ఇసుక తోలమని కోరింది. దీంతో దళారులు డబ్బులు దండుకుని బోయినవారిపాలెం గ్రామ శివారులోని సమాధుల్లో ఇసుకను గురువారం అర్ధరాత్రి ఎక్స్‌కవేటర్ ద్వారా ట్రాక్టర్‌లలో నింపారు. ఇసుక తీసుకొచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ ఇసుకను దిబ్బగా వేసి వెళ్లిపోయాడు. అందులో ఉన్న మృత దేహాన్ని గమనించలేదు. ఉదయాన్నే ఇంటి పని కోసం వచ్చిన బేల్దారి కూలీలు బేస్ మట్టాన్ని ఇసుకతో నింపేందుకు



గుట్ట తవ్వుతుండగా అందులో నుంచి మృత దేహం బయటపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన కూలీలు విషయాన్ని ఇంటి యజమానికి తెలిపారు. ఇంటి నిర్వాహకురాలు లక్ష్మి పోలీసులకు సమాచారం అందించింది. మృతదేహం రోజులు వ్యవధిలో పూడ్చిన దివ్యాంగుడిది. తల లేదు. మొండెం మాత్రమే ఉండటంతో ఎక్స్‌కవేటర్‌తో తవ్వేక్రమంలో తల ఊడిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇంటి యజమానురాలి ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ నిమ్మగడ్డ ప్రసాదు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం ఎక్కడిది... ఇసుక ఎక్కడ నుంచి తరలించారు... అసలు ఏం జరిగింది అనే వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు. ఇసుక మాఫియా... అడ్డదారుల్లో సంపాదనకు అలవాటుపడి సమాధులను సైతం వదలడం లేదనీ, అర్ధరాత్రి శవాలతో ఇసుక వ్యాపారం చేస్తున్నారని, ఇటువంటి ఇసుక దొంగలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ ఆగడాలపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ: కడప లోక్‌సభ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవటానికి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ శుక్రవారం లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ కడప లోక్‌భ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పులివెందులలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తుంటే వైసీపీ అల్లరి మూకలు అడ్డుకున్నాయని, ప్రజలను, కాంగ్రెస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేశాయని ఫిర్యాదు చేశారు. లింగాల గ్రామంలో, సింహాద్రిపురంలో కూడా కాంగ్రెస్ పార్టీ జెండాలను దహనం చేసి... ప్రజలను చెల్లాచెదురు చేయడమే కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలపై భౌతికదాడులకు దిగినట్లు ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారం పోలీసుల కనుసన్నల్లోనే జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవడం కోసం తగిన వాతావరణాన్ని, భద్రత కల్పించాలని కోరారు. జరిగిన ఘటనలపై నివేదిక తెప్పించుకొని... భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సంపాదకీయం

దిల్లీలో రాష్ట్రపతి పాలన?

మద్యం విధానం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయి జైలులో ఉన్నారు. అరెస్టు అయిన తరవాత కూడా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయలేదు. పైగా జైలు నుంచే పరిపాలన కొనసాగిస్తానంటున్నారు. జైలు నుంచి కొన్ని ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఇది అపూర్వమైన పరిస్థితి. పదవిలో ఉండగా అరెస్టయినన ముఖ్యమంత్రి ఇప్పటిదాకా కేజ్రీవాల్ ఒక్కరే. ముఖ్యమంత్రులుగా ఉన్న వారిని ఇంతకు ముందు కూడా అరెస్టు చేశారు. కానీ లాలూ ప్రసాద్ యాదవ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఒకప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అరెస్టు తప్పదని తెలిసిన తరవాత రాజీనామా చేశారు. కానీ కేజ్రీవాల్ ఇప్పటికీ రాజీనామా చేయడానికి నిరాకరిస్తున్నారు. మద్యం కేసులో ఆయన దోషిగా తేలితే రాజీనామా చేయక తప్పకపోవచ్చు. ఆయన జైలులో ఉన్నప్పటికీ నిందితుడే. అందువల్లే ఆయన రాజీనామా చేయడానికి నిరాకరిస్తున్నారు. దిల్లీ మద్యం కేసులో అరెస్టు అయిన మనీశ్ సిసోడియా 13నెలలకు పై నుంచి జైలులోనే ఉన్నారు. జైలుకెళ్లిన కొన్నాళ్లకు ఆయన రాజీనామా చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సత్యేంద్ర జైన్ ఇప్పటికీ జైలులో ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌ను కూడా ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ (ఇ.డి.) అరెస్టు చేసింది. ఆరు నెలలు జైలులో ఉన్న తరవాత అత్యున్నత న్యాయస్థానం ఆయనను ఇటీవల బెయిలుపై విడుదల చేసింది. ఆయన మీద ఇ.డి. మోపిన ఆరోపణలను సుప్రీంకోర్టు తుత్తినియలు చేసింది. అంతకు ముందు సంజయ్ సింగ్‌కు బెయిలు మంజూరు చేయడానికి నిరాకరించిన దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ నిరాకరిస్తే ఆయన సుప్రీంకోర్టులో అర్జీ పెట్టుకుని బెయిలు మీద విడుదలయ్యారు. మొన్న తనను ఇ.డి. అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ పెట్టుకున్న అర్జీ కూడా అదే న్యాయమూర్తి దగ్గర విచారణకు వెళ్లింది. తనను ఇ.డి.అరెస్టు చేయడం అక్రమం అని కేజ్రీవాల్ పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టేసింది కూడా ఆమే. అయితే ఈ పిటిషన్ లో కేజ్రీవాల్ బెయిలు మంజూరు చేయాలని కోరలేదు కనక బెయిలు ప్రస్తావనే రాలేదు. కేజ్రీవాల్ మీద ఇ.డి. మోపిన ఆరోపణలలో వాస్తవం ఉందని న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ అభిప్రాయ పడ్డారు. కేజ్రీవాల్ బెయిలు కోరలేదు కనక ఆ న్యాయమూర్తిని తప్పు పట్టడానికి వీలు లేక పోవచ్చు. కానీ సుప్రీంకోర్టు ఇ.డి. వ్యవహారాన్ని తప్పు పట్టిన సందర్భాలను ఆ న్యాయమూర్తి పట్టించుకున్నట్టు లేదు. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కేజ్రీవాల్ నాయకత్వంలో 2015 నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ దిల్లీలో అధికారంలో ఉంది. కేంద్రంతో సహా అనేక చోట్ల తమ ప్రభుత్వాలు కొనసాగుతున్నప్పుడు దిల్లీలో తమకు అధికారం లేకపోవడాన్ని మోదీ నాయకత్వంలోని బీజేపీ జీర్ణించుకోలేకపోతోంది. లెఫ్టినెంట్ గవర్నరుగా ఎవరున్నా కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికే ప్రయత్నిస్తున్నారు. ఇది మోదీ సర్కారు ప్రమేయంతోనే అని చెప్పక్కర్లేదు. ఎలాగైనా సరే దిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని పడగొట్టి ఆ పార్టీని నిర్వీర్యం చేయడానికి మోదీ సర్కారు వేయని ఎత్తులేదు. పన్నని పన్నాగం లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రులకు, శాసనసభ్యులకు భారీగా డబ్బు ముట్ట చెప్పడానికి బీజేపీ సిద్ధంగా ఉందన్న వార్తలు వచ్చాయి. ఇప్పటిదాకా కేజ్రీవాల్ అనుచరులెవరూ లొంగక పోవడం బీజేపీకి గొంతు దిగడం లేదు. మద్యం కుంభకోణం జరిగిందా లేదా, అందులో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులకు డబ్బు ముట్టిందా లేదా అనేది ఇంకా తేలాల్సే ఉంది. సిసోడియాను, సంజయ్ సింగ్ ను, సత్యేంద్ర జైన్ ను అరెస్టు చేసి కేజ్రీవాల్ కు ఇ.డి. నోటీసుల మీద నోటీసులు ఇచ్చినా ఆయన పట్టించుకోక పోవడంతో కేంద్ర ప్రభుత్వ అహం దెబ్బ తిన్నది.

దిల్లీ ప్రభుత్వాన్ని త్వరలో బర్తరఫ్ చేయవచ్చునని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిషి అంటున్నారు. దిల్లీకి ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలో అనేక పాలనాధికారాలు ఉన్నాయి. అలాంటప్పుడు రాష్ట్రపతి పాలన విధించవలసిన అవసరం ఏమిటి అన్న ప్రశ్న తలెత్తడం సహజం. కానీ జైలు నుంచే పరిపాలన కొనసాగిస్తానని కేజ్రీవాల్ భీష్మించుకు కూర్చోవడం కేంద్రాన్ని దిక్కు తోచని స్థితిలో పడేస్తోంది. అరెస్టు అయితే జైలు నుంచి పరిపాలించకూడదని రాజ్యాంగంలో ఏ నిబంధనా లేదు. కేజ్రీవాల్ ను జైలు నుంచి పరిపాలించకుండా నిరోధించాలని దాఖలైన పిటిషన్లను న్యాయస్థానాలు ఒకటికి రెండుసార్లు తోసి పుచ్చాయి. అది పరిపాలనకు సంబంధించిన అంశం కనక తాము జోక్యం చేసుకోబోమని న్యాయస్థానాలు స్పష్టంగా చెప్పడంతో కేంద్ర ప్రభుత్వం కొత్త దార్లు వెతుకుతోంది. ఒకటి: లెఫ్టినెంట్ గవర్నరుకు ఉన్న అధికారాలను వినియోగించేట్టు చేయడం. లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ఇప్పటికే అలాంటి సంకేతాలు ఇస్తున్నారు. జైలు నుంచి పరిపాలించకుండా చూస్తానని ఆయన దిల్లీ ప్రజలకు భరోసా ఇచ్చేశారు. రెండు: ఆమ్ ఆద్మీ పార్టీని ముక్కలు చేయడం. ఆమ్ ఆద్మీ పార్టీకి రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. వీరిలో అయిదుగురు కేజ్రీవాల్ ను అరెస్టు చేయడంపై ఎలాంటి వ్యాఖ్యా చేయలేదు. వారి మౌనం వెనక బీజేపీ కుట్ర ఉండొచ్చు. మోదీ సర్కారు రాష్ట్రపతి పాలన విధించడం కన్నా ప్రతిపక్ష పార్టీల చట్టసభల సభ్యుల్ని కొనేయడం, బాహాటంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం మీదే ఎక్కువ శ్రద్ధ చూపుతోంది. గోవా, మధ్య ప్రదేశ్ లో ఇంతకు ముందు జరిగిన పరిణామాలే దీనికి నిదర్శనం. రాష్ట్రపతి పాలన విధిస్తే కేవలం ఆ ప్రభుత్వాలు పోతాయి. కానీ ఆమ్ ఆద్మీ పార్టీ సమైక్యంగా ఉంటే మళ్లీ అధికారంలోకి వస్తుంది. మళ్లీ ఎన్నికలు నిర్వహించినా ఆమ్ ఆద్మీ పార్టీ విజయం ఖాయం అన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ తమ అదుపాజ్ఞల్లో ఉన్న వారే అయినందువల్ల ఆయన ద్వారానే వ్యవహారం నడుపుతూ ఆమ్ ఆద్మీ పార్టీని దెబ్బ తీయడానికే బీజేపీ నాయకత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టుంది. అదే సమయంలో ఆ పార్టీని ఛిద్రం చేయాలని చూస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ శాసన సభ్యుడు రాజ్ కుమార్ ఆనంద్ ఎమ్మెల్యే పదవికే కాక ఆమ్ ఆద్మీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. దీని వెనక కచ్చితంగా బీజేపీ హస్తం ఉండి ఉంటుంది. ముఖ్యమంత్రిని జైలుకు పంప గలిగినప్పుడు, మంత్రులు రాజీనామా చేయక తప్పని పరిస్థితి కల్పించగలిగినప్పుడు, వారిని జైలులో పెట్టగలిగినప్పుడు అంతిమంగా రాష్ట్రపతి పాలన విధించడం అసాధ్యమైంది కాకపోవచ్చు. కానీ బీజేపీ లక్ష్యం దిల్లీ ప్రభుత్వాన్ని పడగొట్టడం మాత్రమే కాదు. ఆమ్ ఆద్మీ పార్టీని సర్వనాశనం చేయడం. అది ఏ రూపంలో జరిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

దేశభక్తి సరే... కోర్టు భక్తి మాటేమిటీ...!?

క్షమాపణలకి ఆయుర్వేదంలో మందుందా...!? పోనీ యోగాసనాలతో అత్యున్నత న్యాయస్థానాన్ని మురిపించగలమా...!? రెండు కాళ్లని మెడలోకి దూర్చేసి, చేతుల్ని మెడకి, కాళ్లకి మధ్య ఉన్న ఖాళీలోకి తోసేసి ఆ యోగాసనాన్ని విప్పలేక సదరు యోగాసనంలో ఉన్న ఆసామికి క్షమాపణ చెబితే సరిపోతుందా..!? రెండు రోజుల తర్వాత వెళ్లే విదేశీ ప్రయాణానికి మంచి మూహూర్తం కాదంటూ పక్కింట్లో ఓ జత బట్టలు నిర్గమనం పెట్టుకున్నట్లుగా "మేం ఉండడం లేదు మహాప్రభో... మాకు వెసులబాటు కల్పించండి" అని సుప్రీంకోర్టుకు అర్జీ పెట్టుకుంటే చాలుతుందా... గుండెల వరకూ గెడ్డాన్ని, నడుం చివరి వరకూ జుట్టుని పెంచేసి, కాషాయం కట్టుకుని ప్రజల అమాయకత్వం, ఆరోగ్యంపై వారికున్న అలవిమాలిన ప్రేమని ఆసరాగా చేసుకుని లక్షల కోట్ల వ్యాపారాలు చేసేస్తూ ఆనక నాలిక కరుచుకుంటే అయోధ్య రాముడు అంగీకరిస్తాడా......!? అన్నీ వేదాల్లోనే ఉన్నాయంటూ అల్లోపతీ కంటే ఆయుర్వేదమే ప్రాచీనమని వాణిజ్య ప్రకటనలివ్వడం ఈ దేశంలో నేరం కాదా.....!? అసలు ఒక వ్యక్తిని కాని, మరో వ్యవస్థని కాని అవమానించేలా మాట్లాడడం, లక్షలకు లక్షలు పోసి పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం నైతికమేనా...!? ఇసుమంతైనా జ్ఞానం లేని నాకే ఇన్ని

చక్రవాకం
- ముక్కాముల చక్రధర్

అనుమానాలు వస్తే దేశంలోనే అత్యున్నత న్యాయస్థానానికి ఇంకెన్ని ప్రశ్నలు వస్తాయి. బాబా రామ్‌దేవ్ గారి ఆయుర్వేద ఉత్పత్తుల గురించి దేశంలో ఎవరూ ఎక్కడా చెడుగా చెప్పిన దాఖలాలు లేవు కదా... ప్రజాస్వామిక దేశంలో ఎవరికి నచ్చిన, ఎవరికి ఇష్టం వచ్చిన రీతిన బతకడమే కాదు... మందులు కూడా మింగవచ్చు కదా. మరి కోట్లాది మంది దశాబ్దాలుగా నమ్మిన అల్లోపతీని కించపరిచేలా, అదీ పతంజలి సంస్థ తమ మందులు అమ్ముకుందుకు వేసిన పన్నాగంలా ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు అనిపించి న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తప్పు కాదు కదా... "మీరు తప్పు చేస్తున్నారు సరిదిద్దుకోండి... అందుకోసం కోర్టుకు రండి" అని మర్యాదగా ఆహ్వానిస్తే కోర్టుకు రాకుండా, నెలల తరబడి తాత్సారం చేసి ఆనక క్షమించండి అంటూ ఓ మాట అంటే ఎవరైనా అంగీకరిస్తారా... "మనుషులన్నాక తప్పులు చేస్తారు" అని ముక్కు గోక్కుంటూ పతంజలి వారి న్యాయవాది ముకుల్ రోహత్గీ చెబితే సరిపోతుందా...

అయితే, ఈ కేసులో ఓ వాస్తవం తేలింది. ఓ నిజం బహిర్గతమైంది. కోర్టంటే ఇన్నాళ్లు రాతి కట్టడం అనుకున్న వారికి, కళ్లకి గంతలు కట్టుకుని చేతిలో త్రాసుతో నిలబడిన న్యాయ దేవత, చేతిలో కేసుల కాగితాలతో అటు ఇటూ హడావుడిగా తిరుగుతున్న నల్ల కోట్లు అని తలచిన వారికి ఈ దెబ్బతో జ్ఞానోదయమైంది. రాతి కట్టడం వెనుక ఓ మనసుంటుంది. న్యాయ దేవత తన కళ్లకే గంతలు కట్టుకుంది కాని తన ఆత్మాభిమానానికి కాదని తేలింది. నల్ల కోట్లు ఆ భవనంలో కాగితాల కట్టలతో పచార్లు చేయడం లేదని, ఆ కట్టలే ఆయుధాలుగా మార్చుకుని కాపాలా కాస్తున్నాయని లోకానికి తెలిసింది. అందుకే పతంజలి మందుల వారిపై కన్నెర్ర చేసింది. ఇది ముమ్మాటికి కోర్టు ధిక్కారమే అని కోప్పడింది. మీ క్షమాపణ మాకు సమ్మతం కాదంటే కాదు అని అర్డర్ అర్డర్ అంటూ బల్ల మీద గుద్ది మరీ చెప్పింది. ఇక్కడ ఇంకో విషయం కూడా పతంజలి వారికి గుర్తు చేసింది. అదేమిటంటే వారికి ప్రచారం మీద ఉన్న యావ న్యాయస్థానాలకు గౌరవం ఇవ్వడం మీద లేదంది.

అల్లోపతిని కించపరిచేలా ప్రకటనలు గుప్పించిన పతంజలి వారికి వారి అతి పురాతన వైద్యం ఆయుర్వేదం కూడా ఆ అల్లోపతే వంటిదే అని తెలియదా...!? చరక, శుశ్రత, వాగ్భట రుషుల నుంచి వచ్చిన ఆయుర్వేదం నేటి అల్లోపతికి సమానమేనని తెలియదనుకుంటామా...!? చరక మహర్షి చెప్పిన వైద్యం మందుల వాడకం, శుశ్రత మహర్షి చెప్పింది అల్లోపతిలో చేసే సర్జరీ, ఇతరేతర వైద్యం గురించి చెప్పిన మహర్షి వాగ్భటుడు. అంటే ఆ ముగ్గురు రుషులు అల్లోపతికీ సరి సమానమైన వైద్యాన్ని అనాడే అందించారు కదా. నేడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న శిలాజిత్, అశ్వగంధ వైద్యాలను ఆధునీకరించి వాడుతున్నది పతంజలి వారే కదా. శిలాజిత్ ఎక్కడో కాశ్మీర ప్రాంతంలో దొరికే ఓ ద్రవం. పూర్వం ఆ ద్రవాన్ని పళ్లెంలో పోసి సూర్యతాపి అంటే సూర్యుని చేత మండించి అలా మరిగిన ద్రవం పైన ఉన్న తొరకను మందుగా వాడే వారు. కానీ నేటి ఆయుర్వేదంలో శిలాజిత్ ద్రవాన్ని గ్యాస్ పొయ్యిల మీద మండించి, మండించి అది అడుగంటే వరకూ తొరకలను తీసి వాడుతున్నారు. ఇది వైద్యంలో ఆధునిక దోపిడీ కిందే వస్తుంది కదా...ఇక అశ్వగంథం అంటే అంతుపట్టని ఏ వ్యాధికైనా ముందుగా వాడే దివ్య ఔషదం. పేరు లేని రోగానికి పెన్నేరే మందు అని దీనికి పేరొచ్చింది. పెన్నేరు అంటే అశ్వగంథం అని అర్థం. ఇంతకీ ఇదంతా ఆధునిక కాలంలో చారిత్రక వైద్యం అనే పేరుతో జరుగుతున్న ఆయుర్వేద మాఫియా. ఈ మాఫియా బయట పడకుండా ఉండేందుకు దేశభక్తిని, స్థానికతను ఓ సాధనంగా వాడుతోంది ఈ ఆయుర్వేద మాఫియా. "నహి కించిత్ జగత్యనౌషధం" అంటే సృష్టిలో ఔషధానికి పనికిరాని దేదీ లేదు. శాస్త్రం ఇంత వివరంగా చెప్పినప్పుడు ఆయుర్వేద రుషులకు అల్లోపతి వైద్యులపై అంత కోపం ఎందుకు... ఎందుకంటే ఇందులో నోటుంది... జాతీయత ఉంది. దేశభక్తి ఉంది. వీటికి మించి వోటుంది.

సీనియర్ జర్నలిస్టు, సెల్: 99120 19929

మోదీ నియమావళి ఉల్లంఘన

పి.సుధీర్

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవలసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోడ్ ఉల్లంఘనకే పాల్పడుతున్నారు. మతం, అయోధ్యలో రామాలయ నిర్మాణం తదితర అంశాలను అంశాలను ప్రచారం ద్వారా ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు మోదీ ఏమీ వెనుకాడటంలేదు. మతం, దేవాలయాల ప్రచారంద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘింస్తున్న మోదీని ఎన్నికల కమిషన్ ఎందుకు పట్టించుకోవడం లేదు? చిన్నచిన్న పొరపాట్లను చేసిన వాళ్లనుకూడా మందలించే ఎన్నికల కమిషన్ మోదీకి మాత్రం వెసులుబాటు కల్పిస్తున్నారు. మోదీ ఆయా సభల్లో చేసిన ప్రసంగాల్లో ఇండియన్ పీనల్ కోడ్ (భారత శిక్షాస్మృతి) కింద తగిన చర్యలు తీసుకోవలసిన అంశాలు మత భావనలను రెచ్చగొట్టడం, ద్వేష ప్రసంగాలు చేయడం మోదీకి నిత్యకృత్యమైంది. ఈ ప్రసంగాల ద్వారా ఆయన ముఖ్యమైన నేరస్థుడుగా మారిపోయాడు. పాలకపార్టీ బీజేపీ నాయకుల్లో అత్యంత ఉన్నతస్థాయి నాయకుడైన మోదీ ఎన్నికల ప్రచార సభల్లో మత భావజాలాన్ని ప్రస్తావించకుండా ఉండటంలేదు. బిహార్, నవాడా వద్ద ఈ నెల 7వ తేదీన చేసిన ప్రసంగంలో కాంగ్రెస్‌ను, ఆర్‌జేడీని నిందించారు. "అయోధ్యలో భారీ రామాలయం నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్, ఆర్‌జేడీ అన్ని రకాలుగా ప్రయత్నించాయి" అని మోదీ చెప్పారు. రాముడి ప్రాణప్రతిష్ఠకు హాజరుకాకుండా బహిష్కరించారని రాముడంటే ఎందుకు వ్యతిరేకంగా ఉందని మోదీ ప్రశ్నించారు. మోదీకి అలవోకగ అబద్ధాలాడటం బాగా అబ్బిన అలవాటు. శ్రీరామనవమి పండగ త్వరలో జరగనున్నది. ప్రజలు మరచిపోకుండా పండుగ జరుపుకోవాలి. మోదీ ఈ మాటలు చెప్పడం ద్వారా మత భావనలను రెచ్చగొట్టారు. ప్రతిపక్షాలు రాముడికి వ్యతిరేకంగా ఉన్నాయని నిందలు వేశారు. ఇలా మాట్లాడటం మోడల్ కోడ్ ఉల్లంఘన కాదా. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే మోదీ రామాలయాన్ని నిర్మించారు.

నలుగురు పీఠాధిపతులు మోదీ హిందూ ధర్మాలన్నింటినీ ఉల్లంఘించారని, అందువల్ల తాము రాముడి ప్రాణప్రతిష్ఠకు హాజరు కావడంలేదని బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి కనుక ప్రతిపక్షాలను నిందిస్తున్నారు. ఈ మాటలన్నీ ఓట్లు కొల్లగొట్టి మళ్లీ అధికారం చేపట్టడానికి చేస్తున్న చర్యలే. రాజస్థాన్, అజ్మీర్‌లో ఈ నెల 6వ తేదీన జరిగిన సభలో మోదీ కాంగ్రెస్‌పైన దూషణలు కురిపించారు. అయోధ్యలో రామాలయాన్ని సందర్శించిన సభ్యులను కాంగ్రెస్ బహిష్కరించిందని మోదీ అబద్ధాలు చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా రామాలయానికి వ్యతిరేకంగా ఉన్న వారిని వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపివ్వడం ద్వారా ఎన్నికల కోడ్‌ను బాహాటంగా ఉల్లంఘించారు. పోలింగ్ మొదటి దశ ఏప్రిల్ 19న జరుగుతుంది. దానికి రెండురోజుల ముందు నవమి పండుగ ఉంటుంది. ఈ పండుగను ఆచరించనివారిని బహిష్కరించాలని పిలుపునివ్వడం బరితెగించి మోడల్ కోడ్‌ను ఉల్లంఘించడమే. మతాల మధ్య చిచ్చుపెట్టేందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ఉత్తరప్రదేశ్ పిలిభిత్‌లో ఈ నెల 9 వతేదీన జరిగిన సభల్లో మోదీ మాట్లాడుతూ, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ నాయకులు అయోధ్యలో జరిగిన రామాలయం ప్రారంభోత్సవానికి హాజరుకానందున వారికి ఓట్లు వేయరాదనే భావన వచ్చేట్లుగా నిందించారు. ఇలా చేయడం రాముడిని అవమానించినట్లేకదా అన్నారు. ఇండియా కూటమికి చెందినవారు చాలాకాలం నుంచి రామాలయాన్ని ద్వేషిస్తున్నారని మోదీ నిందించారు. యూపీలో ఈ రెండు పార్టీలను నిందించడం ద్వారా మత భావనలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. రామాలయంపై ద్వేషాన్ని ఇండియా కూటమి పెంచుతోందని వారిపట్ల ఉన్న విద్వేషాన్ని వెళ్లగక్కారు.

మోదీ చేస్తున్న ప్రసంగాలు ఎలా ఉన్నాయని ఉదహరించడానికి ఈ అంశాలు సరిపోతాయి. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకే అనుకూలంగా ప్రచారం సాగించడానికి రామాలయాన్ని, మతాన్ని వినియోగించుకుంటున్నారు. ఇలా మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమైనదే అవుతుంది. ఏప్రిల్ 6న ఘజియాబాద్‌లో జరిగిన రోడ్ షోలో మోదీ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా రాముడిని స్తుతిస్తూ పాటలు వినిపించారు. అంతేకాదు, "భారత్‌కా బచ్చా బచ్చా జై శ్రీ రామ్ బోలేగా " అంటూ నినాదాలు చేశారు. బీజేపీకి జై శ్రీరామ్ నినాదం రాజకీయ నినాదంగా తయారైంది. ఇతర బీజేపీ నాయకులు అమిత్‌షా, యోగి ఆదిత్యనాథ్ తదితరులు మోదీ లాగే రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. ప్రధానమంత్రి ఎలా మాట్లాడుతున్నారో వీరు కూడా అదే మార్గంలో పయనిస్తున్నారు. మోడల్ కోడ్ కింద కులం, మతాలను ప్రస్తావిస్తూ, ఓట్ల కోసం ప్రసంగాలు చేయకూడదు. అలాగే మసీదులు, చర్చిలు, ఆలయాలు తదితర ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటే మోడల్‌కోడ్‌ను ఉల్లంఘించినట్లే అవుతుంది. మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాద్ తదితరులు చేసే ప్రసంగాలన్నీ మోడల్‌కోడ్ ఉల్లంఘనలే. ఎన్నికల కమిషన్ ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకుంటుందా? రామాలయాన్ని నిర్మించినవారికే ఓట్లు వేయాలని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారానికి రామాలయం కేంద్ర బిందువైంది. ఈ నాయకులు చేస్తున్న విద్వేష ప్రసంగాలపై సీపీఐ(ఎమ్), ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, అమిత్ షాలు చేసిన విద్వేష ప్రసంగాలపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల కమిషన్ మౌనంగానే ఉంది. ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎన్నికల కమీషనర్లలో ఒకరు అసమ్మతి తెలియజేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసమ్మతిని తెలియజేసిన అశోక్ లవసా రాజీనామా చేశారు. ఇది జరిగాక ఆయన భార్య, కుమారుడిని ఆదాయం పన్ను అధికారులు ఇంటరాగేట్‌చేసి వేధించారు. తప్పుచేసినవారిని వదిలేసి ఎలాంటి తప్పుచేయనివారిని వేధించడం మోదీకి బాగా అలవాటైన చర్య. ఈ సారైనా ఎన్నికల కమిషన్ కోడ్‌లు ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకుంటుందా లేదా అనేది కమిషనర్‌కు పరీక్షలాంటిదే. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ముందు ఇద్దరు కమిషనర్లను నియమించింది. వీరుకూడా కోడ్ ఉల్లంఘించేవారిపైన చర్య తీసుకుంటారని ఆశించడం వృధానే అవుతుంది. వీరు బహుశా మోదీకి అనుకూలంగా వ్యవహరించేవారే అయి ఉండవచ్చు. ఎన్నికల కమిషన్ నిజంగా స్వతంత్రంగా పనిచేస్తుందా? మెజారిటీ హిందూత్వను మత ఎజండాగా తీసుకుని ఇది సర్వసాధారణమే అని భావించేటట్లు పాలకపార్టీ, ప్రధానమంత్రి చర్య తీసుకుంటున్నారు. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించేందుకు మోడల్ కోడ్‌ను ఉల్లంఘించకుండా చర్య తీసుకునేందుకు ఎన్నికల కమిషన్ తన బాధ్యతను తప్పనిసరిగా నిర్వహించాలి.

జలియన్ వాలాబాగ్ ఊచకోతకు 105 ఏళ్ళు

నందిరాజు రాధాకృష్ణ

అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్ బహిరంగ ప్రదేశంలో నిరాయుధులైన భారతీయులపై బ్రిటీష్ సైనికులు అత్యంత దారుణంగా కాల్పులు జరిపి వందలాది మందిని శవాల గుట్టగా మార్చిన సంఘటన చరిత్రలో మాయని మచ్చ. ఆ దుర్ఘటన జరిగి సరిగ్గా ఏప్రిల్ 13 నాటికి 105 సంవత్సరాలు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 1919 ఏప్రిల్ 13న ఆ మారణకాండ జరిగింది. అనేక వందల మంది మరణించడమేకాక పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. ఆ సంఘటనతో భారతదేశ ఆధునిక చరిత్ర ఒక మలుపు తిరిగింది. ఇండో-బ్రిటీష్ సంబంధాలపై శాశ్వత మచ్చ మిగిల్చింది. భారత జాతీయవాదం, స్వాతంత్ర్య ఉద్యమం కోసం మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ దృఢ నిశ్చయానికి బీజం పడింది.

మొదటి ప్రపంచ యుద్ధం(1914-18) సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం భారత్‌లో వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన అణచివేత అత్యవసర అధికారాల ప్రక్రియ. యుద్ధం ముగిసే సమయానికి, అణచివేత చర్యలు సడలిస్తారని, భారత్‌కు మరింత రాజకీయ స్వయం ప్రతిపత్తికి అంగీకారం లభిస్తుందని ప్రజలలో విశ్వాసం ఉండేది. 1918లో బ్రిటీష్ పార్లమెంటుకు సమర్పించిన మోంటాగ్- చెమ్స్‌ఫోర్డ్ నివేదిక వాస్తవానికి పరిమిత స్థానిక స్వపరిపాలనను సిఫార్సు చేసింది. తొలుత భారత ప్రభుత్వం దీనిని ఆమోదించింది. 1919 ప్రారంభంలో 'రౌలత్ చట్టాలు అణచివేత' యుద్ధకాల చర్యలను పొడిగించింది. దీంతో భారతీయులలో ముఖ్యంగా పంజాబ్ ప్రాంతంలో విస్తృతమైన ఆగ్రహం, అసంతృప్తి పెరిగాయి. మహాత్మా గాంధీ ఏప్రిల్ ప్రారంభంలో దేశవ్యాప్తంగా ఒకరోజు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చారు. అమృత్‌సర్‌లో ప్రముఖ భారతీయ నాయకులను అరెస్టుచేసి, నగరం నుండి బహిష్కరించిన వార్త ఏప్రిల్ 10న హింసాత్మక నిరసనలకు దారితీసింది.

అప్పుడు సైనికులు పౌరులపై కాల్పులు జరిపారు. భవనాలు లూటీకి గురయ్యాయి. కొన్ని దగ్ధమయ్యాయి. వాటివల్ల ఆగ్రహోదగ్రులైన జనం సమూహాలుగా మూకలుగా తయారై విదేశీ పౌరులను చంపి, క్రైస్తవ మిషనరీని తీవ్రంగా గాయపరచారు. దాంతో పరిస్థితిని అదుపుచేసి శాంతి పునరుద్ధరణ బాధ్యత బ్రిగ్ నేతృత్వంలోని అనేక డజన్ల సైనిక దళాలు. జనరల్ రెజినాల్డ్ ఎడ్వర్డ్ హారీ డయ్యర్‌కు అప్పగిం చింది బ్రిటీష్ ప్రభుత్వం. సైన్యం తీసుకున్న చర్యలలో భాగంగా బహిరంగ సభలపై నిషేధం అమలులో ఉంది. అమృత్‌సర్ పట్టణంలో స్వర్ణదేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ ఒక తోట. ఏప్రిల్ 13 మధ్యాహ్నం దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యకారణం ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకంగా చేస్తున్న ఉపన్యాసాలను వినడానికి, అనేక విమర్శలకు గురైన రౌలత్ చట్టం క్రింద సత్యపాల్, సైపుద్దీన్ కిచ్లూలను అక్రమ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ అసంఖ్యాకంగా హాజరయ్యారు. వివిధ విభాగాలకు చెందిన 90 మంది సైనికులు(ఇండియన్ ఆర్మీ), వారితో బాటు రెండు సాయుధ వాహనాలు అక్కడికి వచ్చాయి. ఇరుకైన సందుల నుంచి వాహనాలు బాగ్ లోపలికి రాలేకపోయాయి. జలియన్ వాలాబాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా పెద్ద భవనాలతో ఉంది. కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలా వాటికి తాళాలు వేసిఉన్నాయి. 20వేల మంది స్త్రీలు పురుషులు, పిల్లలు సైతం గుమి గూడారు. జలియన్ వాలాబాగ్, దాదాపు పూర్తిగా గోడలతో నిండి ఉంది. లోపలి నుంచీ బయటకు వేళ్లేందుకు ఇరుకైన మార్గం ఒకటే. బహిరంగ సభలపై నిషేధాన్ని ధిక్కరిస్తున్న నిరసనకారులతోపాటు, అది వైశాఖ మాసం సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవ త్సరం. వసంతోత్సవం బైసాఖిని జరుపుకోవడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుండి లెక్కలేనంతమంది అక్కడ చేరారు. డయ్యర్, ఆయన సైనిక బృందం బాగ్ నుంచీ బయటకు వేళ్లే దారి మూసివేశారు. అక్కడకు చేరిన వేలాదిమంది బందీ అయినట్లయింది. ఎటువంటి హెచ్చరిక లేకుండా సైనిక దళాలు గుంపుపై కాల్పులు జరిపాయి. మందుగుండు సామగ్రి అయిపోయే వరకు దాదాపు వందల రౌండ్లు కాల్చినట్లు నివేదికలో నమోదైంది. ఆ రక్తపాతంలో ఎంతమంది మరణించారో కచ్చితంగా తెలియ లేదు కానీ, ఒక నివేదిక ప్రకారం 337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు కలసి మొత్తం 379 మంది మరణించారని అంచనా. వారికి అదనంగా సుమారు 1,200 మంది గాయపడ్డారు. కాల్పులు ఆపిన వెంటనే చనిపోయిన, గాయపడిన వారిని నిర్దాక్షిణ్యంగా వదిలి సైనికులు ఆ స్థలం నుండి వెళ్ళిపోయారు. కాల్పుల తర్వాత పంజాబ్‌లో మార్షల్ లా ప్రకటించారు. ఆ సమయంలో బాహాటంగా అప్పటికే బిక్క చచ్చిఉన్న జనాలను బహిరంగంగా కొరడాలతో కొట్టడం, ఇతరతరా అనేక విధాల హింసించి అవమానించారు. కాల్పుల సంఘటన తదుపరి బ్రిటీష్ చర్యలు ఉపఖండం అంతటా వ్యాపించడంతో భారతీయుల్లో ఆగ్రహావేశాలు పెచ్చుపెరిగాయి. తత్ ఫలితంగా ప్రముఖ బెంగాలీ రచయిత, నోబెల్ గ్రహీత విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 1915లో తనకు లభించిన బిరుదు నైట్‌హుడ్‌ను త్యజించారు. గాంధీ మొదట్లో సంకోచించినా త్వరలోనే మొదటి భారీ-స్థాయి, నిరంతర అహింసాత్మక నిరసన (సత్యాగ్రహ) ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సహాయ నిరాకరణ ఉద్యమం (1920-22), భారత జాతీయవాద పోరాటం గాంధీజీకి అత్యంత ప్రాముఖ్యతనిచ్చింది. భారత ప్రభుత్వం ఈ సంఘటనపై విచారణకు ఆదేశించింది. 1920లో డయ్యర్‌ను అతని చర్యలకు ఖండించి, అతనిని సైన్యం నుండి రాజీనామా చేయమని ఆదేశించింది. ఈ ఊచకోతపై బ్రిటన్‌లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. డయ్యర్ చర్యలను ఖండించారు. అయితే తద్విరుద్ధంగా 1920లో హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రసంగించిన సర్ విన్‌స్టన్ చర్చిల్, అప్పటి యుద్ధ కార్యదర్శి - హౌస్ ఆఫ్ లార్డ్స్ డయ్యర్‌ను ప్రశంసిస్తూ, "పంజాబ్ రక్షకుడు" అని చెక్కిన అక్షరాలతో కూడిన ఖడ్గాన్ని బహుకరించారు. డయ్యర్ సానుభూతిపరులు పెద్ద మొత్తంలో నిధులు సేకరించి ఆయనకు సమర్పించారు. ఈ దుర్ఘటన జరిగిన స్థలంలో ఒక స్మారక స్థూపాన్ని నిర్మించడానికి 1920లో భారత జాతీయ కాంగ్రెస్ తీర్మానించింది. 1923లో ఇందుకు కావలసిన స్థలం కొనుగోలు చేశారు. అమెరికాకు చెందిన బెంజమిన్ పోల్క్ అనే ఆర్కిటెక్టు స్మారక స్థూపానికి రూపకల్పన చేయగా, నిర్మాణానంతరం 1961 ఏప్రిల్ 13న నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్, జవహర్ లాల్ నెహ్రూ వంటి నాయకుల సమక్షంలో ఈ స్తూపం ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. నిరంతరాయంగా వెలిగే అఖండ జ్వాలను తరువాత జోడించారు. 1919న ఏప్రిల్ 13న జరిగిన అమృత్‌సర్ ఊచకోత ఘటన బుల్లెట్ గుర్తులు భవనాలపై ఇప్పటికీ చూడవచ్చు. బులెట్‌ల నుండి తప్పించుకోవడానికి తొక్కిడిలో అనేకులు దూకిన బావి కూడా ఇప్పుడు ఒక సంరక్షిత స్మారక చిహ్నం. 1982లో రిచర్డ్ అటెన్‌బరో సినిమా, "గాంధీ" చిత్రంతో పాటు, "రంగ్ దే బసంతి", "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్" సినిమాలలో కూడా ఈ దృశ్యం చిత్రీకరించారు. అమృత్‌సర్‌లోని జలియన్‌వాలాబాగ్ స్థలం ఇప్పుడు ఒక జాతీయ స్మారక చిహ్నం.

సెల్: 98481 28215

కోలీవుడ్ నటుడు అరుల్‌మణి మృతి

తమిళనాడు: ప్రముఖ కోలీవుడ్ సినీ నటుడు అరుల్‌మణి (65) గుండెపోటుతో మృతిచెందారు. అరుల్ మణికి గురువారం రాత్రి గుండెపోటు రావడంతో వెంటనే ఆయన్ను రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అరుల్ మణి మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అరుల్‌మణి ప్రస్తుతం అన్నాడీఎంకే తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. గత పది రోజులుగా పలు నగరాల్లో ఆయన నిర్విరామంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చెన్నైకి గురువారం వచ్చిన ఆయన అస్వస్థతకు గురయ్యారు. అరుల్‌మణి ప్రముఖంగా సింగం-2, సామాన్యన్, స్లీప్‌లెస్ ఐస్, థెంద్రాల్, తాండవకొనే, రజినీకాంత్ లింగతో సహా పలు తమిళ చిత్రాలలో నటించారు. సూర్య సింగం, సింగం-2 సినిమాల్లో విలన్‌గా నటించారు. అరుల్‌మణి తమిళ సినిమాల్లో విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పలు సినిమాల్లో నటించారు. 'అళగి' సినిమా అరుల్ మణి కెరీర్‌ను మలుపు తిప్పింది. కోలీవుడ్‌లో ఇప్పటి వరకు అళగి, తెనారల్, పొన్నుమణి, ధర్మశీలన్, కరుపు రోజా, వేల్, మరుదమలై, కత్తు తమిళ్, వన యుద్ధం సహా 90 చిత్రాల్లో ... దాదాపు అందరు ప్రముఖ హీరోలతో ఆయన నటించారు.

కేంద్రాన్ని నియంత్రించండి

- ప్రతిపక్షాలపై వేధింపులు, దాడులు సరికాదు
- ఈసీఐకి 87 మంది మాజీ ప్రభుత్వాధికారుల లేఖ

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు సవాళ్లు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పని చేసిన 87 మంది విశ్రాంత ప్రభుత్వాధికారుల బృందం గురువారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కు లేఖ రాసింది. లేఖపై సంతకం చేసిన వారిలో మాజీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఎఫ్ఓఎస్ అధికారులు ఉన్నారు. ఏ రాజకీయ పార్టీతోనూ తమకు సంబంధం లేదని, 'భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాల' పట్ల తమ నిబద్ధతను నొక్కి చెబుతూ దిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సమయాన్ని ప్రశ్నించారు. 'లోక్‌సభ ఎన్నికలు ప్రకటించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న తరుణంలో ప్రతిపక్ష సీనియర్ రాజకీయ నాయకుడిని అరెస్టు చేయడమనేది ఉద్దేశపూర్వకంగా, ప్రేరేపిత కార్యనిర్వాహక చర్యను తలపిస్తుంది' అని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీలు, ప్రతిపక్ష రాజకీయ నాయకులపై వేధింపులు, దర్యాప్తు సంస్థల దాడులు, అరెస్టులు వంటి కలవరపరిచే విధానంపై మరింత ఆందోళనను లేవనెత్తుతూ, 'ఇది దర్యాప్తు సంస్థల ప్రేరణను ప్రశ్నిస్తుంది' అని విశ్రాంత అధికారులు ఆ లేఖలో వివరించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆదాయపు పన్ను శాఖ చర్యలు, సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతలకు జారీ చేసిన నోటీసుల గురించి కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఆదాయపు పన్ను శాఖ భారత జాతీయ కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీల పాత అంశాలను కూడా సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎందుకు తిరిగి తెరవాలనేది అస్పష్టంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ నాయకుడు మహువా మొయిత్రాకు సంబంధించిన స్థలాల్లో సోదాలు నిర్వహించి, ఇతర ప్రతిపక్ష అభ్యర్థులకు నోటీసులు జారీ చేయడం సరికాదు' అని తెలిపారు. 'దర్యాప్తులను పూర్తి చేయడంలో, ఛార్జ్‌షీట్లు దాఖలు చేయడంలో కేంద్ర చట్ట అమలు సంస్థల జాప్యాన్ని చూస్తే, ఈ కేసులను ఎంపిక చేసుకోవడంలో మితిమీరిన అత్యుత్సాహం న్యాయాన్ని అమలు చేయాలనే కోరికకు మించిన అనుమానాన్ని కలిగిస్తుంది' అని పేర్కొన్నారు. ఈ విషయంలో తక్షణ చర్య తీసుకోవడంలో 'ఈసీఐ' వైఫల్యం తమను తీవ్రంగా కలవరానికి గురి చేసిందని కూడా మాజీ అధికారులు తెలిపారు. 'ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనడానికి ప్రతిపక్ష పార్టీలకు స్వేచ్ఛను నిరాకరించడానికి ప్రతీకార రాజకీయాలు ఆచరిస్తున్నప్పుడు ఈసీఐ మౌనంగా కూర్చుంటుందనే ప్రజల అనుమానాలను అణిచివేసేందుకు గత నెలలో జరిగిన సంఘటనల సరళి ఈసీఐ నుంచి గట్టి చర్యను కోరుతోంది' అని తమ లేఖలో పేర్కొన్నారు. 'మా బృందం 2019 లోక్‌సభ ఎన్నికలలో ఇటువంటి అనేక ఉదంతాలను ఎత్తి చూపింది. ప్రస్తుత ఎన్నికలలో కూడా ప్రధాన మంత్రి కంటే తక్కువ వ్యక్తి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు ఈసీఐ దృష్టికి తెచ్చిన తర్వాత కూడా చర్యలు తీసుకోలేదు' అని తెలిపింది. సంతకం చేసినవారు కేంద్ర ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తూ, 'ముఖ్యంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపే చర్యలతో వ్యవహరించడంలో విచిత్రమైన వ్యత్యాసాన్ని ప్రదర్శించింది' అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోని యంత్రాంగాల మాదిరిగానే రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం 'కేంద్ర ప్రభుత్వ స్థాయిలోని యంత్రాంగాల కార్యకలాపాలను, ముఖ్యంగా చట్టాన్ని అమలు చేసే సంస్థల కార్యకలాపాలను' దాని నియంత్రణలోకి తీసుకురావడానికి ఈసీఐ తన అధికారాలను ఉపయోగించాలని వారు పిలుపునిచ్చారు. 'ప్రపంచంలోని అతిపెద్ద ఎన్నికల కసరత్తుకు సంబంధించిన కీర్తి, పవిత్రతను కాపాడేందుకు దృఢసంకల్పంతో వ్యవహరించాలని దేశం మీ (ఈసీఐ) వైపు చూస్తోంది' అని పేర్కొన్నారు. ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి శివశంకర్ మీనన్, బ్రిటన్ మాజీ దౌత్యాధికారి శివ శంకర్ ముఖర్జీ, పంజాబ్ పోలీసు మాజీ డైరెక్టరేట్ జనరల్ జులియో రిబీరో, జాతీయ భద్రతా మాజీ ఉప సలహాదారు విజయ లతా రెడ్డి, ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి కె.సుజాతా రావు, కశ్మీర్, పీఎంవో మాజీ ఓఎస్‌డీ ఎ.ఎస్.దులత్, దిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, సమాచార మాజీ ప్రధాన కమిషనం వజాహత్ హబీబుల్లా ఉన్నారు.

మోదీ రాకతో 'ఇండియా'కు మేలు
సీపీఐ నేత ముత్తరాసన్

చెన్నై: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో ఇండియా కూటమి బలం మరింత పెరగడానికి ప్రధాని నరేంద్ర మోదీ మరిన్నిసార్లు రాష్ట్ర పర్యటనకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరాసన్ కోరారు. తంజావూరు లోక్‌సభ డీఎంకే అభ్యర్థి తంజై అబ్రహాంకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులో ఇండియా కూటమి బలం మరింత పెరగాలంటే ప్రధాని మోదీ మరిన్నిసార్లు రాష్ట్రానికి రావాలని ఆయన కోరారు. కేంద్రంలో పదేళ్లుగా మోదీ అధికారంలో ఉన్నారని, ఆయన కచ్చదీవిని స్వాధీనం చేసుకోలేకపోయారన్నారు. ఇపుడు మాత్రం కచ్చదీవి సమస్యను వివాదాస్పదంగా మార్చేశారన్నారు. హిట్లర్‌కు, నరేంద్ర మోదీకి ఏమాత్రం తేడా లేదన్నారు. దేశంలో విపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీలు ఉండరాదని కుట్ర పన్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఇండియా కూటమి కృషి చేస్తున్నదన్నారు. ఇండియా కూటమి సీట్ల కోసం పొత్తుపెట్టుకోలేదని, సిద్ధాంతం కోసం ఒకటిగా ఏర్పడినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, మతసామరస్య పరిరక్షణ కోసం పనిచేస్తున్నామని, ఈ ఎన్నికలు ఇద్దరు అభ్యర్థుల మధ్య జరిగే పోరు కాదన్నారు.

బెంగాల్‌పై బీజేపీ దుష్ప్రచారం: మమత బెనర్జీ

కూచ్ బెహార్ (పశ్చిమ బెంగాల్) : పశ్చిమ బెంగాల్ ఉగ్రవాదులకు సురక్షిత ఆశ్రయంగా మారిందన్న బీజేపీ ఆరోపణలను రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం తిప్పికొట్టారు. రాష్ట్ర పోలీసుల సత్వర చర్య వల్లే బెంగళూరు పేలుళ్ల కేసులో నిందితులను అరెస్టు చేశామని ఆమె అన్నారు. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో ఇద్దరు నిందితులను పశ్చిమ బెంగాల్‌లో శుక్రవారం అరెస్టు చేయడంతో రాష్ట్రంలో టీఎంసీ పాలన ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామంగా మారిందని ప్రతిపక్ష బీజేపీ ఆరోపించడంతో రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. 'బెంగాల్ సురక్షితం కాదని ఒక బీజేపీ నాయకుడు చెప్పడం విన్నారు. పోలీసులు వెంటనే స్పందించిన రెండు గంటల్లోనే నిందితులను అరెస్టు చేశారు. మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల సంగతేంటి?' అని ఇక్కడ ఒక ర్యాలీలో ప్రశ్నించారు. ఉత్తర ప్రదేశ్, దిల్లీ, రాజస్తాన్, గుజరాత్, బీహార్‌ల సంగతేంటి?' అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రానికి వ్యతిరేకంగా బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని బెనర్జీ ఆరోపించారు. కాషాయ పార్టీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని, ఎన్నికల్లో "అన్ని రాజకీయ పార్టీలకు స్థాయి పోటీని' అనుమతించడం లేదని టీఎంసీ అధినేత్రి అన్నారు.

బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలైపై కేసు

చెన్నై: బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలైపై పోలీసులు కేసు నమోదు చేశారు. అవరంపాళ్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన నిబంధనలను అతిక్రమించారు. అన్నామలై కోయంబత్తూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల లోగా ప్రచారం ముగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కూడా అన్నామలై ప్రచారం చేశారు. దాంతో పోలీసులు అన్నామలైపై కేసు నమోదు చేశారు. ఆయనతోపాటు బీజేపీ కోయంబత్తూరు జిల్లా అధ్యక్షుడు రమేశ్ పేరును కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

వివాదంలో కాశీ పోలీసుల డ్రెస్‌కోడ్
విపక్షాల తీవ్ర విమర్శలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం కాశీ విశ్వనాథ ఆలయం వద్ద విధులు నిర్వర్తించే పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త డ్రెస్‌కోడ్ ప్రకటించింది. ఇక నుంచి వారు ఖాకీ దుస్తుల్లో కాకుండా సంప్రదాయ వస్త్రధారణలో విధులు నిర్వహిస్తారని వెల్లడించింది. దీనిపై వారణాసి పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే ఆలయ ప్రాంగణం వద్ద విధుల్లో ఉన్న పోలీసులు ధోతీ-కుర్తా, మెడలో రుద్రాక్ష మాలతో అర్చకుల వస్త్రధారణలో కనిపించారు. ఈ నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'పోలీసులు అర్చకుల మాదిరిగా డ్రెస్ కోడ్ ధరించాలని ఏ పోలీసు మ్యానువల్‌లో ఉంది... ఈ ఉత్తర్వులు ఇచ్చిన వారిని వెంటనే సస్పెండ్ చేయాలి. ఒకవేళ రేపు ఎవరైనా దీన్ని అవకాశంగా తీసుకుని మోసాలకు పాల్పడితే... ప్రజలను దోపిడీ చేస్తే... యూపీ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది' అని ప్రశ్నించారు. అటు సామాజిక మాధ్యమాల్లోనూ యోగి సర్కారుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయాన్ని కమిషనర్ మోహిత్ అగర్వాల్ మాత్రం సమర్థించుకున్నారు. "ఆలయాల్లో విధి నిర్వహణ మిగతా ప్రాంతాలతో పోలిస్తే విభిన్నంగా ఉంటుంది. ఇక్కడ రద్దీ శాంతి భద్రతలకు విఘాతం కలిగించదు. అయితే భక్తులకు త్వరగా దర్శనం కల్పించే క్రమంలో కొన్ని సార్లు పోలీసులు వ్యవహరించే తీరు ప్రజలకు బాధ కలిగించొచ్చు. అదే వారు అర్చకుల మాదిరిగా కనిపిస్తే భక్తులు సానుకూల కోణంలో ఆలోచించే అవకాశం ఉంటుంది. అందుకే ఈ డ్రెస్‌కోడ్‌ను మార్చాం" అని పేర్కొన్నారు.

రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసులో ఇద్దరి అరెస్ట్

బెంగళూరు: రామేశ్వరం కెఫే బాంబు పేలుడు కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను జాతీయ దర్యాప్తు సంస్థ అదుపులోకి తీసుకుంది. బాంబర్ ముస్సావిర్ హుస్సేన్ షాజిబ్, సూత్రధారి అబ్దుల్ మతీన్ తాహాను అరెస్టు చేసింది. పేలుడు జరిగిన నాటి నుంచి పరారీలో ఉన్నవారు అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో తలదాచుకున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. కాగా, నిందితులిద్దరినీ ఓ క్యాప్ పట్టించింది. దానిని కొనడానికి వెళ్లినప్పుడు సీసీటీవీలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించారు. వీరు తరచూ సిమ్ కార్డులు మారుస్తూ అండర్‌గ్రౌండ్‌కు వెళ్లేందుకు యత్నించినప్పటికీ... ఎన్ఐఏ రాడార్ నుంచి వారు తప్పించుకోలేకపోయారు. పేలుడుకు మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న నిందితుడు మల్నాడు ప్రాంత వాసి అని ఇప్పటికే దర్యాప్తు సంస్థ గుర్తించింది. గతంలో శివనసముద్రం, గుండ్లుపేట, తమిళనాడులోని కృష్ణగిరి అటవీ విభాగంలో కొందరు యువకులకు ఆయుధాల వినియోగంపై శిక్షణ ఇచ్చాడని పేర్కొంది. మార్చిలో బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో ఉన్న కెఫేలో బాంబు పేలిన ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ కేసును కర్ణాటక హోంశాఖ ఎన్ఐఏకు అప్పగించింది. నిందితుడు ఆర్‌డీఎక్స్ ఉపయోగించాడని నిపుణులు గుర్తించారు. అతడు ఏ మార్గంలో కెఫేలోకి వచ్చాడు?... బాంబు అమర్చిన తర్వాత ఎలా వెళ్లాడు... అనే అంశంపై సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు అనుమానితులను విచారించారు. బాంబర్ కెఫేలో అనుమానాస్పదంగా తిరుగుతూ రవ్వ ఇడ్లీ తిని తన చేతిలోని పేలుడు పదార్థాలున్న సంచిని అక్కడపెట్టి హడావుడిగా వెళ్లినట్లు సీసీ కెమెరా చిత్రాల ద్వారా గుర్తించారు. ఈ క్రమంలో ఐదు కిలోమీటర్ల పరిధిలోని వందల కొద్దీ సీసీ కెమెరాల దృశ్యాలను విశ్లేషించారు. టోపీ ధరించిన వ్యక్తి నోటికి మాస్కు కట్టుకుని నల్లబూట్లు, అదే రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు గుర్తించారు. దీంతో టోపీ ఆధారంగా పోలీసులు వేట మొదలుపెట్టడంతో వారు కొనుగోలు చేస్తున్నప్పటి దృశ్యాలు దర్యాప్తు బృందం చేతికి చిక్కాయి. దీంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.

రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించిన మనీశ్ సిసోదియా
మద్యం కుంభకోణం కేసులో మధ్యంతర బెయిల్‌కు...



న్యూదిల్లీ: దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోదియా లిక్కర్ స్కాం కేసులో మధ్యంతర బెయిల్ కోసం రౌస్ అవెన్యూ కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ, ఈడీ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ పిటిషన్‌పై కాసేపట్లో విచారణ చేపట్టే అవకాశం ఉంది. రాబోయే ఎన్నికల్లో ప్రచారం కోసం తనకు బెయిల్ కావాలని కోరుతూ సిసోదియా కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. దిల్లీ ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు అవకతవకలు జరిగాయని, లైసెన్స్ హోల్డర్‌లకు అనవసరమైన ప్రయోజనాలు కల్పించారని, లైసెన్సు రుసుం తగ్గించారని, కాంపిటెంట్ అథారిటీ అనుమతి లేకుండా లైసెన్సులు పొడిగించారని సీబీఐ, ఈడీ ఆరోపిస్తూ ఆయన్ను ఏడాది క్రితం అరెస్టు చేశాయి. ఈ క్రమంలో సిసోదియాను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఫిబ్రవరి 26, 2023న అరెస్టు చేసింది. మార్చి 9, 2023న సీబీఐ ఎఫ్ఐఆర్‌లో వచ్చిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సిసోదియాను మరోమారు అరెస్టు చేసింది. ఫిబ్రవరి 28, 2023న మంత్రి పదవికి సిసోదియా రాజీనామా చేశారు. అంతకుముందు ఫిబ్రవరి 12న దిల్లీ కోర్టు ఆయనకు మూడు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు లక్నోలో జరిగే తన మేనకోడలు వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతినిచ్చింది. దిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో సిసోదియా గతేడాది నుంచి జైలులో ఉన్నారు.

రాజకీయ నేతలపై ఈడీ కేసులు 3 శాతమే: మోదీ

న్యూదిల్లీ: ఈడీ దర్యాప్తు చేస్తున్న అవినీతి కేసుల్లో కేవలం మూడు శాతమే రాజకీయ నాయకులవని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఓటమి ఖాయమని చెప్పుకొచ్చారు. లోక్‌సభలో బీజేపీ వరుసగా రెండుసార్లు సాధించిన మెజార్టీని తమ ప్రభుత్వం ఈ దేశాభివృద్ధి కోసమే ఉపయోగించిందని మోదీ గొప్పలు చెప్పారు. అంతకుముందు కాంగ్రెస్ మాత్రం దశాబ్దాల పాటు తమకున్న మెజార్టీతో ఓ కుటుంబాన్ని బలోపేతం చేసిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ప్రతిపక్షాలకు సైతం తెలుసని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందన్న విపక్షాల ఆరోపణలను మోదీ తోసిపుచ్చారు. అవినీతిపరులపై కఠినచర్యలు చేపట్టేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ప్రధాని చెప్పారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ తమ చర్యలు కొనసాగుతున్నాయని, కేవలం రాజకీయ నాయకులనే దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారన్నారు. ఈడీ దర్యాప్తు చేస్తున్న అవినీతి కేసుల్లో కేవలం 3 శాతం వాటికే రాజకీయాలతో సంబంధం ఉందని, మిగతా 97 శాతం అవినీతి అధికారులు, నేరగాళ్లకు సంబంధించినవేనని మోదీ వివరించారు. 2014లో తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి నిర్మూలనకే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రధాని చెప్పుకొచ్చారు. గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగాల్లో ఇంటర్వ్యూలు రద్దు చేయడం, లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందేలా నేషనల్ సింగిల్ విండో సిస్టమ్ తీసుకురావడం దానిలో భాగమేనని గుర్తుచేశారు. ఈ చర్యలతో గత పదేళ్లలో దాదాపు 10 కోట్ల మంది నకిలీ లబ్ధిదారుల పేర్లు తొలగించినట్లు చెప్పారు. దీంతో రూ.22.75 లక్షల కోట్లను తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడినట్లు తెలిపారు. 2014 ముందు ఈడీ అటాచ్ చేసుకున్న ఆస్తులు విలువ రూ.25 వేల కోట్లు కాగా...గత పదేళ్లలో ఆ మొత్తం రూ.లక్ష కోట్లకు పెరిగిందని మోదీ వెల్లడించారు. పోలింగ్ ప్రారంభం కాకముందు నుంచే ఈవీఎంలపై నిందలు వేశారని, వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని విపక్షాలకూ తెలుసునన్నారు. అందుకే చాలామంది ప్రతిపక్ష నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారని మోదీ విమర్శించారు.

నా ప్రకటనను వక్రీకరించారు
ఆర్‌జేడీ నేత మిసా భారతి

పాట్నా : బీజేపీ అధికారం కోల్పోతే ప్రధాని నరేంద్ర మోదీ జైలుకెళ్లడం ఖాయమని ఆమె చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తాను చేసిన వ్యాఖ్యలు సందర్భానుసారంగా తీసుకోలేదని ఆర్‌జేడీ నాయకురాలు మిసా భారతి స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడ ఆమె విలేకరులతో ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ పెద్ద కుమార్తె మాట్లాడుతూ తన వ్యాఖ్యలు ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపైనే కేంద్రీకృతమై ఉన్నాయని తెలిపారు. ఆర్‌జేడీ భాగస్వామిగా ఉన్న 'ఇండియా' కూటమి అధికారం చేపడితే ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు అవసరమని నొక్కి చెప్పారు. మీడియా తన ప్రకటనను వక్రీకరించిందని, దానికి బీజేపీ అజెండా కారణమని భారతి ఆరోపించారు. 'ప్రధాన మంత్రి గురించి నేను ఎప్పుడూ ఏమీ చెప్పలేదు. మీడియా నా పూర్తి వ్యాఖ్యను ప్రసారం చేయడానికి బదులుగా వక్రీకరించిన దృశ్యాన్ని ప్రసారం చేసింది. ఇది బీజేపీ అజెండా' అని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల వంటి కీలకమైన సమస్యలపై బీజేపీ చర్చించకపోవడాన్ని ఆమె ఎత్తి చూపారు. 'బీజేపీకి ఎలాంటి సమస్య లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతులు, పార్టీ నేతలు గతంలో చేసిన ఇతర వాగ్దానాల గురించి ప్రధాని మాట్లాడారా? అని ప్రశ్నించారు. మిసా భారతి లోక్‌సభ ఎన్నికల్లో పాటలీపుత్ర నియోజకవర్గం నుంచి 'ఇండియా' కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

రాజ్‌కుమార్ ఆనంద్ నివాసం ఎదుట ఆప్ నిరసన

న్యూదిల్లీ : దిల్లీ కేబినెట్‌కు, పార్టీకి రాజీనామా చేసిన తర్వాత రాజ్‌కుమార్ ఆనంద్ పటేల్ నగర్ నివాసం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు శుక్రవారం నిరసన చేపట్టారు. 'నాలుగు సంవత్సరాలుగా ఆనంద్ ఆప్ కోసం పని చేస్తున్నాడు. తనకు ఓటు వేసిన వారికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను వాగ్దానం చేశాడు. తన నియోజకవర్గ ప్రజలు మోసపోయారని భావిస్తున్నారు' అని ఆప్ కార్యకర్త అంకుష్ నారంగ్ అన్నారు. ఆనంద్ పటేల్ నగర్ విధానసభ నియోజకవర్గం నుంచి 2020 దిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి చెందిన ప్రవేశ రతన్‌ను ఓడించి గెలుపొందారు. దిల్లీ ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖతో సహా వివిధ శాఖలను నిర్వహిస్తున్న ఆనంద్ అవినీతి, దళితులకు పార్టీలో ప్రాతినిధ్యం కల్పించడం లేదని ఆరోపిస్తూ బుధవారం మంత్రి పదవికి, ఆప్‌కి రాజీనామా చేశారు. కాగా, ఈ నిరసన సందర్భంగా కొంతమంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారని పార్టీ కార్యకర్తలు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు భయపడి ఆనంద్ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారని నారంగ్ తెలిపారు. 'ఈరోజు ఆప్‌కి చెందిన అనేక మంది కార్యకర్తలు, పటేల్ నగర్ నివాసితులు కూడా రాజ్‌కుమార్ ఆనంద్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మా కార్యకర్తలలో కొంతమందిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు' అని ఆయన వివరించారు. పార్టీ అగ్రనేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా పార్టీ కార్యకర్తలు ఐటీవోల ఉదయం నిరసన చేపట్టారు.

మోదీ విధానాలు ప్రజాస్వామ్యానికే ముప్పు
'ది ఎకనమిస్ట్' మేగజైన్ విశ్లేషణ

The Economist

న్యూదిల్లీ: భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలపై అంతర్జాతీయంగా విమర్శల వర్షం కురుస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్‌ను హిందూ రాజ్యంగా మార్చడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు అంతర్జాతీయంగానూ వ్యక్తమవుతున్నాయి. మోదీ సర్కారు మతోన్మాద పాలనపై లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రఖ్యాత మ్యాగజైన్ 'ది ఎకనమిస్ట్' ఓ కథనంలో తీవ్ర విమర్శలు చేసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక విలువలకు మోదీ సర్కారు తిలోదకాలిస్తోంది. ఆ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు తలెత్తనుంది. సహనశీల, భిన్నమతాలకు నిలయమైన భారత్‌ను హిందూ దేశంగా మార్చడానికి మోదీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని 'ది ఎకనమిస్ట్' మ్యాగజైన్ వ్యాఖ్యానించింది. భారత్‌లో పౌరసత్వ సవరణ చట్టం నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వ విధానాలపై సమీక్ష చేస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. మోదీ ప్రభుత్వ విధానాలు ఎన్నికల్లో విజయం సాధించడానికి దోహదపడవచ్చని, కానీ, దేశానికి అవి 'రాజకీయ విషం'గా మారతాయని ఆరోపించింది. సీఏఏ, తదితర మోదీ విధానాలు రక్తపాతానికి దారితీస్తాయని తీవ్రంగా హెచ్చరించింది. మతం, జాతీయత గుర్తింపుపై విభజన తీసుకురావడం, ముస్లింలు ప్రమాదకరమని పదేపదే వ్యాఖ్యలు చేయడం ద్వారా తన మద్దతుదారులను పెంచుకోవడంలోనూ, దేశ దుస్థితి నుంచి ప్రజల దృష్టి మళ్లించడంలోనూ బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని వివరించింది. ప్రతిపాదిత 'జాతీయ పౌర జాబితా' (ఎన్‌ఆర్‌సీ) కాషాయ పార్టీ విభజన అజెండాకు మరింత దోహదపడనున్నట్లు తెలిపింది. దేశంలో 80 శాతం ఉన్న హిందువులకు రక్షకుడిగా మోదీ తనను తాను చూపించుకునేందుకు అవకాశం ఉన్నదని పేర్కొంది. నిరంతరం ఒక వర్గాన్ని పీడించడం అందరికీ ముప్పుగా మారుతుందని, రాజకీయ వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతుందని హెచ్చరించింది. హిందువులను రెచ్చగొట్టడం, ముస్లింలను ఆగ్రహానికి గురిచేయడం ద్వారా బీజేపీ కొత్తగా రక్తపాతానికి తెరలేపుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

లోక్‌సభ బరిలో ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ఆ పార్టీ అధినేత ఫారుఖ్ అబ్దుల్లా ప్రకటించారు. శ్రీనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తారని తెలిపారు.

శ్రీనగర్ లోక్‌సభ స్థానం నుంచి షియా నాయకుడు అగా సయ్యద్ రుహుల్లా మెహ్దీ పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు చేయడమే కాకుండా జమ్మూకశ్మీర్‌ను విభజించి... రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా బీజేపీ ప్రకటించింది. దీంతో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించకుంటే అసెంబ్లీ బరిలో దిగనని ఒమర్ అబ్దుల్లా ప్రకటించిన విషయం విదితమే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి మహ్మద్ అక్బర్ లోన్ చేతిలో పీపుల్స్ కాన్ఫరెన్స్ అభ్యర్థి రజా అజీజ్ అలీ ఓటమి పాలయ్యారు.

కాంగ్రెస్ మునిగిపోయే నావ: రాజ్‌నాథ్ సింగ్

న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ అని, లోక్‌సభ ఎన్నికలు కాగానే ఆ పార్టీ డైనోసర్లలా అంతరించిపోతుందని రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోస్యం చెప్పారు. ఉత్తరాఖండ్ బీజేపీ అభ్యర్థి అనిల్ బలూనీకి మద్దతుగా శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఉంటే రాజకీయ జీవితం ఉండదనే అనేక మంది నేతలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అనే అతి పురాతన జాతీయ పార్టీ పూర్తిగా అంతరించిపోతుందన్నారు. కాంగ్రెస్ నేతలు బిగ్‌బాస్ హౌస్‌లో కంటెస్టంట్ల వంటి వారని ఎద్దేవా చేవారు. వారు రోజూ ఒకరితో ఒకరు గొడవ పడుతుంటారని, బట్టలు చించుకుంటారని, చివరికి ఆ పార్టీని చిన్నపిల్లలు కూడా గుర్తించలేరన్నారు.

ఎలా ముందుకు?

- చంద్రబాబు నివాసంలో ఎన్డీయే నేతల మంతనాలు
- పవన్, పురందేశ్వరి, అరుణ్, సిద్ధార్థనాథ్ సింగ్ హాజరు
- సీట్ల మార్పుపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో శుక్రవారం ఎన్డీయే కూటమి నేతల సమావేశం జరిగింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, మాజీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు కొనసాగిన సమావేశంలో ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలు, ఎన్నికల ప్రచార శైలి, భవిష్యత్తు కార్యాచరణ, క్షేత్రస్థాయి పరిస్థితులు, కొన్ని స్థానాల అభ్యర్థుల మార్పు తదితర అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. పరస్పర మార్పు కోరుకుంటోన్న వివిధ స్థానాలపైనా కూటమి నేతల మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభల నిర్వహణపైనా నేతలు చర్చించారు. ఫోన్ ట్యాపింగ్, కొందరు ఉన్నతాధికారుల ఏకపక్ష వైఖరి, ఎన్నికలు సజావుగా సాగాలంటే కొందరు ఉన్నతాధికారులను బదిలీ చేయాల్సిన పరిస్థితులు, తదితర అంశాలపై నేతల మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఎన్నికల ప్రచారం మరింత వేగవంతం చేయాలని, బూత్, అసెంబ్లీ, పార్లమెంట్ పరిధిలో సమావేశాలు నిర్వహించాలని ఎన్డీయే నేతలు నిర్ణయించారు. ప్రచార వ్యూహం, ఎన్నికల నిర్వహణ పరిశీలనకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుచేయాలని భావించారు. ఓట్ల బదిలీపై క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే అభ్యర్థిత్వాల ఖరారు, సీట్ల సర్దుబాట్లకు సంబంధించి కూటమి పార్టీల్లో నెలకొన్న అసంతృప్తులు, అలకలు, బుజ్జగింపు వంటి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసుకుని ప్రచారం పైనే అందరూ దృష్టి పెట్టాలని సమావేశం నిర్ణయించింది. ఇటీవల ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమి సభలు విజయవంతం కావడంపై నేతలు సంతృప్తి వ్యక్తంచేశారు. సాధ్యమైనన్ని ఎక్కువ చోట్ల ఉమ్మడి సభలు నిర్వహించాలని నేతలు అభిప్రాయపడ్డారు. అధికార దుర్వినియోగంపై ఎప్పటికప్పుడు ఈసీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. కూటమి తరపున మోదీ, అమిత్ షా, నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, 25 లోక్‌సభ, 160కి పైగా అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు.

అదానీ కోసం గిరిజన చట్టాలకు తూట్లు

జగన్ సర్కారుపై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ:
రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన చట్టాలను, హక్కులను తుంగలో తొక్కుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. అదానీ అడుగులకు మడుగులొత్తుతోందని ఆరోపించారు. మన్యం స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టును అదానీ కంపెనీకి కట్టబెట్టడాన్ని రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. జగన్ ప్రభుత్వం ఏపీలోని పోర్టులు, పవర్ ప్రాజెక్టులు, సోలార్ విద్యుత్ కేంద్రాలు అదానీ కంపెనీలకే కట్టబెట్టిందని, ఇప్పుడు మన్యంలో స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టులను కూడా అదానికి ఇచ్చి...గిరిజన చట్టాలను, హక్కులను హరిస్తున్నదని విమర్శించారు. గిరిజనేతరులకు ప్రాజెక్టులు ఇవ్వకూడదని గిరిజన చట్టాలు స్పష్టం చేస్తున్నప్పటికీ జగన్ సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. 3400 మెగావాట్ల సామర్థ్యం గల మూడు స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టులు అదానీ కంపెనీకి, 1000 మెగావాట్ల సామర్థ్యం గల మరో ప్రాజెక్టు జగన్ బినామీ కంపెనీ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. ఇందుకోసం రెండు వేల ఎకరాలకు పైగా భూములను అదానీ, జగన్ బినామీ కంపెనీలకు కట్టబెట్టడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరుడిగానే పరిగణిస్తామనే సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా వైసీపీ ప్రభుత్వం కాలరాస్తోందని గుర్తు చేశారు. తక్షణమే మన్యం స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఒప్పందాన్ని రద్దుచేసి... గిరిజనులకే కేటాయించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

25న సీఎం జగన్ నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఈ నెల 25న పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. తొలుత ఇడుపులపాయ వైఎస్ఆర్ ఘాట్‌కు వెళ్లి వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. జగన్ నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ఈనెల 24తో శ్రీకాకుళం జిల్లాతో పూర్తి కానుంది. 25న తాడేపల్లి నుంచి కుటుంబ సభ్యులతో కలిసి జగన్ పులివెందులకు చేరుకుని నామినేషన్ వేస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పులివెందులలో సీఎం జగన్ తరపున ఈనెల 22న ఒక సెట్ నామినేషన్ దాఖలు చేస్తారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలకు ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నోటిఫికేషన్ 18వ తేదీన విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమవుతుంది. ఇప్పటికే జగన్ విజయాన్ని కాంక్షిస్తూ పులివెందులలో ఆయన సతీమణి వైఎస్ భారతి ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆమె ప్రచారాన్ని కొనసాగిస్తారు. 25న జగన్ నామినేషన్ వేసిన అనంతరం పులివెందుల కేంద్రంగానే ఆమె మకాం వేసి, ఎన్నికల ప్రచారంపై ప్రధాన దృష్టి పెట్టనున్నారు. కడప పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ భారతి ప్రచారం నిర్వహించే అవకాశముంది. ఒక వైపు కడప వైసీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్ రెడ్డి, మరో వైపు భారతి ప్రచారం ఉండేలా స్థానిక నేతలు రూట్ మ్యాప్‌ను రూపొందిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పులివెందుల నుంచి జగన్ 90,110 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ విడత అంతకంటే మెజార్టీని దాటించాలన్న లక్ష్యంతో వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. దీంతో భారతి ప్రత్యేక టీమ్‌తో ప్రచారానికి నిమగ్నమయ్యారు. కడప ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిగా షర్మిల రంగంలోకి దిగడంతో ఏకంగా అవినాశ్ గెలుపుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. జగన్ మెజార్టీపైనా ఆ ప్రభావం పడుతుందన్న ప్రచారముంది. కడప పార్లమెంట్ పరిధిలో షర్మిల సుడిగాలిలా పర్యటిస్తున్నారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి కేసులను ప్రస్తావిస్తూ, జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ఆమె ప్రచారం కొనసాగుతోంది. షర్మిల వెంట ఆమె సోదరి సునీత ఉంటున్నారు. సునీత తండ్రి వైఎస్ వివేకా హత్య సంఘటనలను గుర్తుచేస్తూ వారిద్దరు కాంగ్రెస్ పక్షాన ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

గుంతలే పూడ్చలేని జగన్

మూడు రాజధానులు నిర్మిస్తాడా?

'ప్రజాగళం'లో చంద్రబాబు ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో -బాపట్ల:
రాష్ట్రంలో రోడ్లపై గుంతలు పూడ్చటం తెలియని సీఎం జగన్, మూడు రాజధానులు నిర్మిస్తాడా అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో శుక్రవారం ప్రజాగళం ఎన్నికల ప్రచార సభ జరిగింది. చంద్రబాబు మాట్లాడుతూ రాజధాని విషయంలో వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందన్నారు. వేమూరులో ఓటు వేసిన వారినే కాటేసే రకం జగన్ అని ధ్వజమెత్తారు. ఎక్కువ నష్టపోయింది ఎస్సీలేనన్నారు. దళితుల కోసం ప్రవేశపెట్టిన 25 రకాల పథకాలను రద్దు చేసి వారిని అన్ని రకాలుగా మోసం చేశారని మండిపడ్డారు. ఉపాధికి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళు న్నారు. అమరావతి పూర్తయితే ఇక్కడే అందరికీ ఉపాధి దొరికేది. ఈ ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. డయాఫ్రం వాల్, కాఫర్ డ్యామ్, గైడ్ బండ్ పోయాయన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరిగిందన్నారు. నాసిరకం మద్యం తాగి అనేకమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యులు జీవించలేని స్థితిలో ఉన్నారన్నారు. మీ పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్డీయే అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ వేమూరు అభ్యర్థి నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ అభ్యర్థి తన్నేటి కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, సురేశ్ దంపతులు టీడీపీలో చేరిక
కొల్లూరులో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు, గుంటూరు జడ్పీ చైర్మన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, వైసీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేసిన సురేశ్ దంపతులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మోసం... విశ్వసనీయతకు యుద్ధం

- వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- గుంటూరు సిద్ధం సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం:
టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మోసాలకు, ప్రజలకు మధ్య జరిగే యుద్ధమే ఈ ఎన్నికలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇంటింటికి పెన్షన్ అందించిన ప్రభుత్వానికి...ఆ పెన్షన్ ఆపిన చంద్రబాబు దుర్మార్గానికి మధ్య యుద్ధం జరుగుతోందని చెప్పారు. చంద్రబాబు మోసాలకు, వైసీపీ ప్రభుత్వ విశ్వసనీయతకు మధ్య ఎన్నికల యుద్ధం జరుగుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయనంత అభివృద్ధి, సంక్షేమాన్నితమ ప్రభుత్వం చేసి చూపించిందని సీఎం జగన్ చెప్పుకున్నారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర 13వ రోజు గుంటూరు జిల్లా ఏటుకూరుకు శుక్రవారం చేరుకుంది. ఈ సందర్భంగా ఇక్కడ జరిగిన బహిరంగ సభలో జగన్‌మోన్‌రెడ్డి మాట్లాడుతూ 130 సార్లు బటన్ నొక్కి రూ.2.70 లక్షల కోట్ల నగదును నేరుగా పేదల ఖాతాల్లో జమ చేశానని తెలిపారు. గత 58 నెలల వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి ఓటు వేయాలని అభ్యర్థించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి...ఇప్పుడు మీ ముందు నిలబడి మీ ఆశీస్సులు కోరుకుంటున్నానని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో వచ్చిన మార్పును ఒక్కసారి గమనించమని కోరుతున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2014లో రంగురంగుల మేనిఫెస్టోతో ప్రజల జీవితాలతో చెలగాటమాడిందని విమర్శించారు. చంద్రబాబు హయాంలో రైతు రుణమాఫీ చేయలేదని, డ్వాక్రా రుణాలు రద్దు చేయలేదని, మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డకు రూ.25 వేల డిపాజిట్ హామీ నెరవేరలేదని, చంద్రబాబును నమ్మితే ఒక్క హామీ అమలు కాదని జగన్ విమర్శించారు. బాబు వస్తే జాబు అన్నారు. నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తానన్నారు. పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇస్తానన్నారు. ఇందులో ఒక్కటీ అమలు చేయలేదని గుర్తు చేశారు. 2014లో జతకట్టిన ఈ ముగ్గురు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా మళ్లీ ఆ ముగ్గురే ఈ రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని ఆరోపించారు.

ఆ మూడు రోజులూ అంబేద్కర్ స్మృతివనంలో

ఉచిత ప్రవేశాలు కల్పించండి

సీఈఓ ముకేశ్ కుమార్ మీనాకు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ:
అంబేద్కర్ జయంతి, వర్ధంతి, భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని అంబేద్కర్ స్మృతివనంలో ఉచిత ప్రవేశానికి అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ శుక్రవారం లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగుజీవుల ఆశాజ్యోతి భారతరత్న బీఆర్ అంబేద్కర్ స్మారకార్థం నగరం నడిబొడ్డున స్మృతివనం నిర్మించి, ఆ మహనీయుని విగ్రహాన్ని 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం' పేరుతో ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ప్రవేశానికి నామమాత్రపు రుసుం వసూలు చేయటం సబబే అని పేర్కొన్నారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి, డిసెంబరు ఆరున వర్ధంతి సభలు జరుగుతాయని ఆయా తేదీల్లో ఉచిత ప్రవేశాలు కల్పించాలన్నారు. అంబేద్కర్ తన అపారమైన మేథోసంపత్తి, అనుభవంతో సామాజిక న్యాయ కోణంలో రచించిన రాజ్యాంగాన్ని దేశానికి అందించి, నవంబరు 26న అమలులోకి తీసుకువచ్చిన భారత రాజ్యాంగ దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నట్లు లేఖలో వివరించారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ స్మృతివనం, విజ్ఞాన సముదాయం, సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ఏప్రిల్ 14, నవంబరు 26, డిసెంబరు ఆరు తేదీల్లో ప్రజలు సందర్శించేందుకు ఉచిత ప్రవేశం కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు.

అరకు ఎంపీ, 8 అసెంబ్లీ సీట్లు

కాంగ్రెస్‌తో కుదిరిన సీపీఎం సర్దుబాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఒక పార్లమెంట్‌తోపాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు సీపీఎం నిర్ణయించింది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వర రావు అధ్యక్షతన వర్చువల్‌గా జరిగింది. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరయ్యారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీ, దాని మిత్ర పక్షాలను, బీజేపీ కొమ్ముకాస్తున్న నిరంకుశ వైసీపీని ఓడించడానికి ఇండియా వేదిక పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చేసుకొని ఉమ్మడిగా పోటీ నిర్ణయంలో భాగంగా సీపీఐ, కాంగ్రెస్ పార్టీలతో చర్చల అనంతరం జరిగిన ఒప్పందం ప్రకారం పోటీ చేయాలని రాష్ట్ర కమిటీ ఆమోదముద్ర వేసింది. ప్రధానమైన రెండు పార్టీలు, కూటములు బీజేపీకి లొంగిపోయిన నేపథ్యంలో రాజకీయ కర్తవ్య నిర్వహణలో ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా సర్దుబాటు చేసుకుని పోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని వివరించింది. గతంలో సీపీఎం పది అసెంబ్లీ స్థానాలు ప్రకటించినప్పటికీ రాజకీయ ఆవశ్యకత రీత్యా కాంగ్రెసుతో సీట్ల సర్దుబాటు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం శ్రేణులు తమ పార్టీ అభ్యర్థితో పాటు ఇండియా వేదిక పార్టీలైన సీపీఐ, కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, రాష్ట్ర ప్రజానీకం ఓట్లువేసి గెలిపించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. సీపీఎంకు కేటాయించిన స్థానాల వివరాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విడుదల చేశారు. అటు ఇండియా కూటమి పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయించిన స్థానాల వివరాలను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారు. పార్లమెంటు: అరకు, అసెంబ్లీ: రంపచోడవరం, కురుపాం, గాజువాక, విజయవాడ (సెంట్రల్), గన్నవరం, మంగళగిరి, నెల్లూరు టౌన్, పాణ్యం నియోజకవర్గాల్లో సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తారు.

జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా

- తర్వాత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం
- కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు: మోదీ

శ్రీనగర్:
జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా కల్పిస్తామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదంపూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌ను గొప్ప రాష్ట్రంగా మలిచే పనిలో తాను బిజీగా ఉన్నానన్నారు. త్వరలో రాష్ట్ర హోదా పొందుతుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మోదీ ఎడాపెడా హామీలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఎంతో దూరం లేదని చెప్పారు. ఈ ఎన్నికల అనంతరం మీరు కన్న కలలు.. మీ ఎమ్మెల్యేలు, మంత్రులతో పంచుకోవచ్చున్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఎంతో కాలంగా ప్రజలు పడుతోన్న ఇబ్బందులు తన హామీలతో తొలిగిపోనున్నాయని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో మళ్లీ ఆర్టికల్ 370ని ప్రతిపక్షాలు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని మోదీ ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్‌గా నిలిచిందని మోదీ విమర్శించారు. నవరాత్రుల సందర్భంగా ఇండియా కూటమి నేతలు మాంసాహారం తీసుకుంటున్నారని ఆరోపించారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అనేది బీజేపీ తీసుకున్న అతిపెద్ద సాహసోపేతమైన నిర్ణయమని చెప్పారు. ఇది అందరికీ సమాన రాజ్యాంగ హక్కులను కల్పిస్తుందని, ఇండియా కూటమి భారత సంస్కృతిని విస్మరించిన బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. కూటమి నేతలకు ప్రజల మనోభావాలతో పని లేదని, విలువలు పట్టించుకోవడం లేదని, విభజన రాజకీయాలకు పాల్పడతారని ఆరోపణలు గుప్పించారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ప్రతిపక్షాలు దూరంగా ఎందుకున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ప్రాణ ప్రతిష్ఠను ఎన్నికల కార్యక్రమంగా అభివర్ణించారన్నారు. ఉదంపూర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా జితేందర్ సింగ్, జమ్మూ నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా జుగల్ కిషోర్ ఎన్నికల బరిలో నిలిచారు. వారి తరపున మోదీ ప్రచారం నిర్వహించారు. 2019 ఆగస్టులో జమ్మూకశ్మీర్‌లో అమలులో ఉన్న ఆర్టికల్ 370ని మోదీ ప్రభుత్వం రద్దు చేసిన విషయం విదితమే. ఏప్రిల్ 19వ తేదీ ఉదంపూర్ లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

ఇజ్రాయిల్, ఇరాన్‌కు వెళ్లొద్దు

భారత పౌరులకు విదేశాంగ శాఖ అలెర్ట్

న్యూఢిల్లీ:
పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న వేళ భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇజ్రాయిల్, ఇరాన్‌లకు ప్రయాణం చేయవద్దని భారత పౌరులకు సూచించింది. తదుపరి ప్రకటన ఇచ్చే వరకూ ఇవి పాటించాలని తెలిపింది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ ఏ క్షణమైనా దాడులు చేయొచ్చనే వార్తలు వస్తున్న నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం ఇజ్రాయిల్ లేదా ఇరాన్‌లో ఉంటున్న వారు స్థానిక భారత రాయబార కార్యాలయానికి అందుబాటులో ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది. అక్కడ తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపింది. పౌరులు తమ భద్రతపై జాగ్రత్తలు పాటించాలని, బయటకు వెళ్లడాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని పేర్కొంది.

ఇదిలా ఉంటే, డమాస్కస్‌లోని తమ రాయబార కార్యాలయంపై దాడి జరిగినప్పటి నుంచి ఇరాన్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఆ దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళానికి చెందిన ఏడుగురు జనరల్స్ మృతి చెందడాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. దీనికి ఇజ్రాయిల్ కారణమని భావిస్తోన్న ఇరాన్.. వారిని శిక్షిస్తామని బహిరంగ ప్రకటనలు చేస్తోంది. అయితే, నేరుగా కాకుండా లెబనాన్ లేదా సిరియా నుంచి తన మద్దతుదారులైన హెజ్‌బొల్లా, ఇతర మిలిటెంట్ సంస్థలతో ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడులు చేయించ వచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఈవీఎంలపై సమాధానం ఇవ్వకపోవడం చట్ట ఉల్లంఘనే

సీఈసీని నిలదీసిన సీఐసీ

న్యూఢిల్లీ:
ఎన్నికల సమయంలో వీవీప్యాట్ యంత్రాలు, ఈవీఎంల విశ్వసనీయతపై ప్రశ్నలను లేవనెత్తుతూ ప్రముఖ పౌరులు ఇచ్చిన 'ప్రాతినిధ్యం' పై తీసుకున్న చర్యల గురించి అడిగిన ఆర్‌టీఐ అభ్యర్థనకు ఎన్నికల సంఘం (ఈసీఐ) సమాధానం ఇవ్వకపోవడంపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) శుక్రవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చట్టానికి సంబంధించి 'స్పష్టమైన ఉల్లంఘనే' అని పేర్కొంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) కు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై, దానిపై తీసుకున్న చర్యల వివరాలను కోరుతూ సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టం కింద ఎన్నికల సంఘానికి మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ దేవసహాయం ఆర్‌టీఐ అభ్యర్థన దాఖలు చేశారు. ఈ అభ్యర్థనను మే 2, 2022న ఈసీకి పంపారు. నవంబర్ 22, 2022న దాఖలు చేసిన ఆర్‌టీఐ దరఖాస్తు ద్వారా అభ్యర్థన పంపిన వ్యక్తులు, ప్రభుత్వ అధికారుల గురించి, సమస్యపై జరిగిన ఏవైనా సమావేశాల వివరాలు, అన్ని సంబంధిత ఫైల్ నోట్స్ గురించి దేవసహాయం తెలుసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. తప్పనిసరి 30 రోజుల వ్యవధిలో ఈసీ ఆయనకు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. ఉన్నతాధికారులకు దేవసహాయం చేసిన మొదటి విజ్ఞప్తిని కూడా పట్టించుకోలేదు. ఎన్నికల సంఘం నుంచి స్పందన లేకపోవడంతో ఆయన రెండవ అభ్యర్థనలో సీఐసీని ఆశ్రయించారు. ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమరియా ప్రశ్నించినప్పుడు, దేవసహాయంకు ఎందుకు సమాధానం ఇవ్వలేదనే దానిపై సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడంలో ఈసీకి చెందిన కేంద్ర ప్రజా సమాచార అధికారి విఫలమయ్యారు. 'కమిషన్ కేసు రికార్డులు, విచారణ సమయంలో సమర్పించిన సమర్పణలను పరిశీలించిన తర్వాత ఆర్‌టీఐ చట్టం ప్రకారం నిర్దేశించిన గడువులోపు ఆర్‌టీఐ దరఖాస్తుకు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా అప్పటి ఈసీకి చెందిన ప్రజా సమాచార అధికారి ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. అందువల్ల, ఆర్‌టీఐ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించినందుకు రాతపూర్వక వివరణను అందించాల్సిందిగా ప్రస్తుత ప్రజా సమాచార అధికారి ద్వారా అప్పటి ప్రజా సమాచార అధికారిని కమిషన్ ఆదేశిస్తుంది' అని సమరియా చెప్పారు. ఆర్‌టీఐ దరఖాస్తుపై 30 రోజుల్లోగా పాయింట్ల వారీగా సమాధానం ఇవ్వాలని సమరియా ఈసీని ఆదేశించారు.

'ఇండియా' కూటమికి విజయావకాశాలు

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ:
లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యర్థి 'ఇండియా' కూటమికి విజయావకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం అన్నారు. అయోధ్యలోని రాముడి విగ్రహంపై మోదీ ప్రమాణం చేసి, దేశానికి రప్పించిన నల్లధనం, రైతుల ఆదాయం రెట్టింపు, రెండింతలు, కోటి ఉద్యోగాలు, రైతులకు కనీస మద్దతు ధర కల్పించారా, ప్రతి ఒక్కరికి రూ.15 లక్షలు ఇచ్చారా చెప్పాలని సవాల్ విసిరారు. 'ఆయన దేవుని పేరు జపిస్తాడు. ధరలు పెంచి పేద ప్రజలను చితకబాదారు. పేద ప్రజలు బతుకుతున్నారంటే దానికి కారణం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు హామీలు' అని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కల్బుర్గి (గుల్బర్గా) నుంచి నామినేషన్ దాఖలు చేసిన తన అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి తరపున ప్రచారం చేస్తున్న సందర్భంగా ఖర్గే బహిరంగ సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈడీ, ఆదాయపు పన్ను, సీబీఐ, విజిలెన్స్‌తో ప్రజలను మోదీ బెదిరిస్తున్నారని ఆరోపించారు. 'మా పార్టీలోని వ్యక్తులు అవినీతిపరులు. కానీ మీ పార్టీ (బీజేపీ)లోకి వచ్చిన వెంటనే వారు క్లీన్ అయిపోయారా?' అని ప్రశ్నించారు. 'అందుకే నేను తరచుగా చెబుతుంటాను. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వద్ద ఒక భారీ వాషింగ్ మెషీన్ ఉందని, అందులో బట్టలు మాత్రమే కాకుండా మనుషులు కూడా ఉంచుతారు. మీరు వాటిని అక్కడ ఉంచిన తర్వాత, అవి శుభ్రంగా బయటకు వస్తాయి. ఇప్పుడు బీజేపీలోకి వచ్చిన వ్యక్తి శుభ్రమయ్యాడు' అని ఖర్గే ఎద్దేవా చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

డిప్యూటీ స్పీకర్ లేని 17వ లోక్‌సభ

సభా నాయకుడైన ప్రధానమంత్రికే లోక్‌సభ మీద గౌరవం లేనప్పుడు ఇంతవరకు కొనసాగిన ఉత్తమ సంప్రదాయాలకు విలువ ఉంటుందనుకోలేం. మోదీ హయాంలో అనేక సభా మర్యాదలను ఉల్లంఘించారు. అందులో ప్రధానమైంది సంప్రదాయంగా వస్తున్న డిప్యూటీ స్పీకర్ లేకుండానే అయిదేళ్లు గడిచిపోవడం. ఇది అప్రాజాస్వామికం అని ప్రతిపక్షాలు మొరపెట్టుకున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోనే లేదు. ఇంతకు ముందెప్పుడూ ఈ పరిస్థితి లేదు. సాధారణంగా ప్రతిపక్షానికి చెందిన సభ్యుడిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకునే సంప్రదాయం ఉంది. 1956లో అప్పటి ప్రధాని నెహ్రూ ఈ సంప్రదాయం ప్రారంభించారు. అప్పుడు శిరోమణి అకాలీ దళ్ నాయకుడు సర్దార్ హుకుం సింగ్‌ను డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకున్నారు. ఆ తరవాత అధికార పార్టీ అయిన కాంగ్రెస్‌కు చెందిన వారే డిప్యూటీ స్పీకర్లయ్యారు. ఎమర్జెన్సీ కొనసాగుతున్నప్పుడు మాత్రం ఇండిపెండెంట్ సభ్యుడు జీజీ స్వెల్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించారు. ఆ తరవాత 16వ లోక్‌సభ దాకా ప్రతిపక్షానికి చెందిన వారే డిప్యూటీ స్పీకర్లు అయ్యారు. 16వ లోక్‌సభలో అన్నా డీఎంకే నాయకుడు ఎం. తంబిదురై ఆ స్థానంలో ఉన్నారు. అయితే అన్నా డీఎంకే అప్పుడు బీజేపీకి మిత్రపక్షం. ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ స్థానం కట్టబెట్టే ఆనవాయితీ కొనసాగించడం ఇష్టం లేకే 17వ లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ఆ స్థానాన్ని ఖాళీగా ఉంచేసింది. 17వ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు 54 సీట్లే ఉన్నాయి. ఆ పార్టీ సభ్యుడు డిప్యూటీ స్పీకర్ కావాలంటే 56 మంది సభ్యులు ఉండాలట. అయితే రెండు స్థానాలు తక్కువైనా కాంగ్రెస్‌కు ఆ స్థానం అప్పగించకపోవడం కేవలం సాంకేతిక కారణంగానే. ఇవ్వదలచుకుంటే ఇచ్చి ఉండవచ్చు. అధీర్ రంజన్ చౌదరీ లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడే తప్ప ప్రతిపక్ష నాయకుడి హోదా లేదు. ఎందుకంటే కాంగ్రెస్‌కు తగినన్ని సీట్లు లేవు. ఏ రాజ్యాంగ స్థానమూ కాంగ్రెస్‌కు ఇవ్వడం మోదీకి ఇష్టం లేదు కనుక డిప్యూటీ స్పీకర్ ఊసే ఎత్తలేదు.

లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఉండాలని రాజ్యాంగం నిర్దేశిస్తుంది కానీ అది ప్రతిపక్షానికి ఇవ్వాలని లేదు. నెహ్రూ ఆ సంప్రదాయం ప్రవేశ పెట్టారు. స్పీకర్ ఎన్నిక జరిగిన తరవాత వారం పది రోజుల్లో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం ఆనవాయితీ. ఆ స్థానం ఖాళీగా ఉన్నా సభా కార్యకలాపాలు నడిచాయిగా, ఇంకా లోటేమిటి అని బీజేపీ వింత వాదన లేవదీసింది. రాజ్యాంగంలోని 93వ అధికరణం లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఉండాలని నిర్దేశిస్తోంది. 178వ అధికరణం శాసనసభలకు సంబంధించి ఈ మాటే చెప్తోంది. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేని అంశం గత ఏడాది సుప్రీంకోర్టుకెక్కింది. ఈ పిటషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు పీఎస్ నరసింహా, జేబీ పార్దీవాలా కేంద్ర ప్రభుత్వానికి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, మణిపూర్ శాసనసభలకు నోటీసులు జారీ చేసింది. 17వ లోక్‌సభ త్వరలో ముగుస్తుంది కనక ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం లేదు.

నోరు విప్పని ఎంపీలు

సినిమా నటులు, కళాకారులు రాజ్యసభకు నామినేట్ కావడమే కాక నేరుగా లోకసభకు ఎన్నికైన వారు కూడా చాలా మందే ఉన్నారు. వీరిలో కొందరు మాత్రమే సభా కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటారు. సుదీర్ఘ కాలం పార్లమెంటు సభ్యులుగా ఉన్నా నోరు విప్పని ప్రసిద్ధులూ ఉంటారు. అందులో 17వ లోక్‌సభ సభ్యులుగా ఉన్న ప్రముఖ సినీ నటులు శతృఘ్న సిన్హా, సన్నీ దేవల్ (డియోల్), రాజ్యసభ సభ్యుడు సురేశ్ గోపి అయిదేళ్ల కాలంలో ఒక్క సారైనా నోరు విప్పలేదు. శతృఘ్న సిన్హా చాలా కాలం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారు. 2002 నుంచి 2008 దాకా ఆయన రాజ్యసభ సభ్యుడు. వాజపేయి ప్రభుత్వంలో ఆరోగ్య మంత్రిగా, నౌక నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నారు. 2009 నుంచి 2019 దాకా రెండు దఫాలు పాట్నా సాహిబ్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 17వ లోక్‌సభలో అసన్‌సోల్ నుంచి ఉప ఎన్నికలో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. మొట్ట మొదట శతృఘ్న సిన్హా బీజేపీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన మరో ప్రముఖ నటుడు రాజేశ్ ఖన్నాతో పోటీ చేసి ఓడిపోయారు. 2019లో కాంగ్రెస్‌లో చేరారు. కానీ ఎన్నికలలో పోటీ చేయడానికి సీటు ఇవ్వకపోవడంతో అమాంతం తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.

నటులు, కళాకారులు పార్లమెంటుకు ఎన్నికైనా వారు సభకు హాజరయ్యేది తక్కువే. అయితే శతృఘ్న సిన్హా మాత్రం ఇందుకు మినహాయింపు. ఆయన 77% శాతం రోజులు సభకు హాజరయ్యారు. ఇప్పుడు ఆయన మళ్లీ అసన్‌సోల్ నుంచి తృణమూల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నటుడిగా ఆయనది కంచు కంఠం. డైలాగులు చెప్పడంలో ఆయనది విశిష్ట శైలి. కానీ ప్రజావాణి వినిపించడంలో ఆయన జీరో. 17వ లోక్‌సభలో మాత్రం ఆయన నోరే మెదపలేదు. నోరు మెదపని వారిలో శతృఘ్న సిన్హాకు మరో ఎనిమిది మంది తోడున్నారు. ఇంకో సినిమా నటుడు సన్నీ దేవల్ కూడా అదే బాపతు. ఆయన ప్రముఖ సినీ నటుడు ధర్మేంద్ర కుమారుడు. సన్నీ దేవల్ అసలు పేరు అజయ్ సింగ్ దేవల్. 2019లో ఆయన బీజేపీలో చేరారు. 2019లో గురుదాస్ పూర్ నుంచి గెలిచారు. ఈ ఇద్దరు నటులు సభలో మాట్లాడడం కానీ, లిఖిత రూపంలో భాగస్వాములు కావడం కానీ లేదు. సన్నీ దేవల్ అయితే పార్లమెంటుకు హాజరైన రోజులు 18 శాతమే. సన్నీ లిఖిత రూపంలో పార్లమెంటు కార్యకలాపాల్లో చిన్న పాత్ర అయినా పోషించారు. శతృఘ్న సిన్హా కు అయితే అదీ లేదు. వీరితో పాటు మరో ఆరుగురు బీజేపీ సభ్యులదీ ఇదే వరస. తృణమూల్‌కు చెందిన ఇద్దరు, బహుజన సమాజ్ పార్టీ సభ్యులు ఒకరు కూడా లోక్‌సభలో మౌనంగానే ఉండిపోయారు. పార్లమెంటుకు మొదటి సారి ఎన్నికైన వారికి ప్రత్యేకంగా మాట్లాడే అవకాశం కల్పించే సంప్రదాయం 17వ లోక్‌సభలోనే కల్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రెండు సార్లు సన్నీ దేవల్‌ను మాట్లాడమని కోరినా ఆయన నోరు విప్పలేదు.

కర్నాటకలోని చిక్క బళ్లాపూర్ నుంచి ఎన్నికైన బి.ఎన్.బాచె గౌడ, ఉత్తర కన్నడ నుంచి ఎన్నికైన అనంత్ కుమార్ హెగ్డే, చమరాజ నగర్ నుంచి లోక్‌సభలో ప్రవేశించిన వి. శ్రీనివాస ప్రసాద్, బీజాపూర్ నుంచి ఎన్నికైన సి. జిగజి నాగి కూడా సభలో నోరు మెదపలేదు. వీరంతా బీజేపీకి చెందిన వారే. అసోం లోని లఖింపూర్‌కు ప్రాతినిధ్యం వహించిన బీజేపీ నాయకుడు ప్రధాన్ బారువా కూడా అదే బాపతు. ఆయన ఇప్పుడు మళ్లీ పోటీ చేస్తున్నారు. ఘోసి నుంచి ఎన్నికైన బీఎస్పీ సభ్యుడు అతుల్ కుమార్ సింగ్ కూడా సభలో మౌనంగా ఉండిపోయారు.

కర్నాటకలో ఊపందుకున్న ప్రచారం

కర్నాటకలో తొలి విడత ఎన్నికలకు మరో రెండు వారాల సమయం మాత్రమే ఉండడంతో ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగియగా, ఆయా అభ్యర్థులు ప్రచారాల్లో మునిగితేలుతున్నారు. దేవాలయాల సందర్శన, రోడ్‌షోలు, సామాజిక మాధ్యమాలు, బహిరంగ సభల ద్వారా ప్రచారాన్ని ఉరకలెత్తిస్తున్నారు. రానున్న రెండు వారాల్లో తారా ప్రచారకుల హవా మొదలవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 14న రాష్ట్రంలో పర్యటిస్తారు. ఆయన మైసూరు, మంగళూరుల్లో బహిరంగ సభలు, రోడ్‌షోలో పాల్గొంటారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి జైశంకర్ రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటిస్తారు. కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కీలక నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక శనివారం నుంచి రాష్ట్రంలో ప్రచారంలో పాల్గొంటారు. ఈ నెల 26న 14 లోక్‌సభ నియోజకవర్గాలలో పోలింగ్ జరగనున్నది. మొత్తం 247 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రెండో విడత ఎన్నికల కోసం నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ప్రారంభమైంది. మే 7న నిర్వహించే ఈ ఎన్నికల కోసం నామినేషన్ల తుది గడువు ఈ నెల 19న ముగుస్తుంది. తొలి విడత ఎన్నికలతో పోలిస్తే మలివిడత ఎన్నికల్లో 35 లక్షల మంది అదనంగా ఓటు వేస్తారు. రెండో విడతలో అత్యంత ప్రతిష్ఠాత్మక నియోజకవర్గాలు, ప్రముఖులు ఎక్కువగా ఉండగా, తిరుగుబాటు అభ్యర్థుల బెడద కూడా పార్టీలను వెంటాడనుంది.

తొలి విడత ఎన్నికల్లో అత్యంత ప్రతిష్ఠాత్మక నియోజకవర్గాలలో బెంగళూరు గ్రామీణ, మాండ్య, మైసూరు-కొడగు, చిక్‌బళ్లాపూర్, కోలారు, తుమకూరు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఎంపీ డీకే సురేశ్, డాక్టర్ సీఎన్ మంజునాథ్, యదువీర్ చామరాజ ఒడెయర్, వి.సోమణ్ణ వంటి ప్రముఖులు తొలి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కోలారు, తుమకూరు, చిక్‌బళ్లాపూర్, చిత్రదుర్గ నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలు ఎక్కువగా అసమ్మతిని ఎదుర్కొంటున్నాయి. రెండో విడతలో ఎన్నికలు జరిగే నియోజకవర్గాలలో అత్యధికం బీజేపీకి తలనొప్పిగా మారనున్నాయి. మాజీ ముఖ్యమంత్రులు బసవరాజ బొమ్మై, జగదీశ్ శెట్టర్‌తో పాటు బీజేపీకి సెగలు పుట్టిస్తున్న కేఎస్ ఈశ్వరప్ప స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే శివమొగ్గ, లింగాయత్ మఠాధిపతులు బీజేపీపై కన్నెర్ర చేసిన ధార్వాడ, సిట్టింగ్‌లు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న కొప్పళ, దావణగెరె, బాగల్‌కోటెలు మలివిడతలో కీలకంగా పరిగణించే నియోజకవర్గాలు. మొత్తం 14 నియోజకవర్గాల్లో కనీసం 10 చోట్ల ఆయా పార్టీలకు సవాలు విసురుతున్నాయి. బీజేపీకి దింగాలేశ్వర స్వామి, కేఎస్ ఈశ్వరప్ప, రేణుకాచార్య, కాంగ్రెస్‌కు వీణా కాశెప్పనవర్, జీబీ వినయ్‌కుమార్ నుంచి ముప్పు పొంచి ఉంది. వీరంతా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగితే ఆయా పార్టీల అభ్యర్థులు గెలుపుకోసం చెమటోడ్చాల్సిందే. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత జిల్లా కాలబుర్గి కాంగ్రెస్‌కు ఎంతో ప్రతిష్ఠాత్మకం. రెండో దశలో వారసుల కోసం మంత్రుల పోరాటం మొదలవుతుంది. తొలిదశలో బెంగళూరు దక్షిణలో మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యారెడ్డి, చామరాజనగర నుంచి మహదేవప్ప కుమారుడు పోటీ చేస్తున్నారు. రెండో దశలో బెళగావి నుంచి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్, చిక్కోడి నుంచి సతీశ్ జార్కి హోళి కుమార్తె ప్రియాంక జార్కి హోళి, బీదర్‌లో ఈశ్వర ఖంద్రే కుమారుడు సాగర్ ఖంద్రే, బాగల్‌కోటెలో శివానంద పాటిల్ కుమార్తె సంయుక్త పాటిల్ పోటీచేస్తున్నారు. మొత్తం నలుగురు మంత్రుల వారసులతో పాటు దావణగెరెలో మరోమంత్రి మల్లికార్జున భార్య ప్రభా బరిలో ఉన్నారు. తొలిదశ ఎన్నికలతో పోలిస్తే రెండో దశ ఎన్నికలు మంత్రులకు ఎంతో కీలకంగా మారనున్నాయి.

రాజకుటుంబాలకు బీజేపీ టికెట్లు

దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల క్రమం తుదిదశకు చేరుకుంది. ప్రధాన పార్టీలు పోటీ చేసే అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. వారు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. సినీ రంగంతో పాటు రాజకుటుంబానికి చెందిన వ్యక్తులకు అనేక పార్టీలు సీట్లు కేటాయిస్తున్నాయి. రాజకుటుంబాలకు చెందిన వారికి టికెట్ల కేటాయింపులో బీజేపీ ముందున్నది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థుల్లో 12మంది రాజకుటుంబాలకు చెందిన వారున్నారు. వీరిలో ఐదుగురు తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండగా, మరో ఏడుగురు ఇప్పటికే రాజకీయాల్లో ఉన్నారు. దేశ రాజకీయాల్లో రాజకుటుంబాల ఆధిపత్యం ఇప్పటిది కాదు, ఎప్పటి నుంచో వస్తోంది. గతంలో కాంగ్రెస్ నుంచి ఎక్కువ మంది రాజకుటుంబానికి చెందిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపించేవారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యలో రాజకుటుంబానికి చెందిన వ్యక్తులు టికెట్ల కోసం బీజేపీకి క్యూ కడుతున్నారు.

కీర్తి సింగ్ దేవ్ వర్మ

బీజేపీ మార్చి 13న విడుదల చేసిన రెండో జాబితాలో మైసూర్ లోక్ సభ స్థానానికి సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సింహను కాదని, మైసూర్ రాజకుటుంబానికి చెందిన యదువీర్ కృష్ణదత్ చామరాజ వడియార్‌ను రంగంలోకి దించింది. యదువీర్ తాతయ్య శ్రీకంఠదత్త నరసింహరాజ వడియార్ మైసూర్ నుంచి నాలుగుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందడంతో ఆయన రాజకీయాల నుంచి వైదొలిగారు. ప్రస్తుతం ఆయన మనవడు మైసూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

యదువీర్ కృష్ణదత్ చామరాజ

త్రిపుర తూర్పు లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ రేవతికి టికెట్ నిరాకరించిన బీజేపీ ఆస్థానంలో కీర్తి సింగ్ దేవ్ వర్మను అభ్యర్థిగా ప్రకటించింది. మాణిక్య రాజ కుటుంబానికి చెందిన కీర్తిసింగ్ దేవ్ తిప్ర మోతా పార్టీ నేత ప్రద్యోత్ దేవ్ వర్మకు అక్క. తిప్ర మోత పార్టీ ఇటీవల ఎన్డీఏ కూటమిలో చేరింది. ప్రస్తుతం త్రిపుర రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది.

బీజేడీ మాజీ ఎంపీ అర్కా కేశరి దేవ్ భార్య మాళవిక కేశరి దేవ్‌కు బీజేపీ ఒడిశాలో టికెట్ కేటాయించింది. ఆమె కలహండి రాజకుటుంబానికి చెందిన వ్యక్తి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోనూ బీజేపీ రాజకుటుంబానికి చెందిన వ్యక్తులను బరిలోకి దింపిది. వీరి ప్రభావం ఏ మాత్రం ఉండబోతుందనేది జూన్ 4 ఫలితాలతో తేలనుంది.

బీజేడీలో అసమ్మతి సెగలు

ఒడిశాలోని పాలక బీజేడీలో అసంతృప్తి సెగలు భగ్గుమంటున్నాయి. ఎన్నికల సమయంలో అధికార పార్టీలో లుకలుకలు విజయావకాశాలపై ప్రభావం చూపుతాయని పరిశీలకులంటున్నారు. పార్టీకి విధేయులుగా ఉన్నవారిని కాదని, తిట్టిపోసిన వలస నేతలకు ఎర్రతివాచీ పరచడం భావ్యమేనా అని నేతలు నిలదీస్తున్నారు. ప్రసార సాధనాల ముందు అక్కసు వెళ్లగక్కుతున్నారు. రాష్ట్రంలోని 147 అసెంబ్లీ స్థానాలకు 10 వేల మంది ఆశావహులు దరఖాస్తులు చేసినట్లు బీజేడీ వర్గాలు తెలిపాయి. వారంతా అర్హులే. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్వయంగా దరఖాస్తులు పరిశీలిస్తున్నారని, దరఖాస్తు చేసినవారిలో అవినీతి, నేర చరిత్ర లేని వారికే టికెట్లు కేటాయిస్తారని బీజేడీ అగ్రనేతలు ప్రకటించారు. ఎన్నికల భేరీ మోగక ముందు నుంచి నవీన్ పట్నాయక్ నివాస్‌లో అభ్యర్థుల వివరాల పరిశీలన జరుగుతున్నా ఇంతవరకు తేలలేదు. ఇదింకా కొనసాగుతోంది. ఇంతవరకు ప్రకటించిన జాబితాలో సిటింగ్ నేతలు, వారి రక్త సంబంధీకులకు ప్రాధాన్యమిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి వలస వచ్చిన వారందరికీ పెద్దపీట వేశారు. ఇంకా వస్తున్నవారి కోసం కొన్ని సీట్లు రిజర్వు చేశారు. ఈసారి నేర చరితులకు చోటు లేదని ముందుగా చెప్పిన నాయకత్వం తర్వాత వారికీ టికెట్లు కేటాయించడంపై మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

దీర్ఘకాలంగా పార్టీకి విధేయులుగా ఉన్నవారంతా ఈసారి సీఎం న్యాయం చేస్తారని ఆశలు పెంచుకున్నారు. ఆయా సెగ్మెంట్లలో పాతుకుపోయిన నేతల స్థానంలో తమకు అవకాశమిస్తారన్న అంచనాలను పార్టీ అధినేత తలకిందులు చేశారు. నిన్నగాక మొన్న దూషించిన నాయకులు బీజేడీ కండువాలు కప్పుకోవడంతో వారికి టిక్కెట్లు కేటాయించేశారు. ఈ పరిస్థితి మునుపెన్నడూ లేదు. ఆయరాంలంతా రేపటి ఎన్నికల్లో గెలుస్తారన్న గ్యారంటీ లేకపోయినా పట్టించుకోలేదు. 'వైరి పక్షం నుంచి వచ్చిన వారికి ఉన్నతాసనం వేసేయాలంతే' అన్న దానికి నాయకత్వం ఈసారి కట్టుబడుతూ విస్మయానికి గురి చేసింది" అని అసమ్మతీయులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆశావహులు నిత్యం నవీన్ నివాస్‌కు వస్తున్నారు. సీఎంను కలుసుకోలేకపోతున్న కొందరు వి.కార్తికేయ పాండ్యన్, రాజ్యసభ సభ్యులు సస్మిత్ పాత్ర, మానస్ మంగరాజ్‌లను కలుస్తూ తమ ఆవేదన వినిపిస్తున్నారు. మరి కొందరు తమ మద్దతుదారులతో వస్తున్నారు. తమ వెనుక ఉన్న బలగం చూడండని నాయకత్వాన్ని కోరుతున్నారు. అధినాయకత్వం కాదన్నా, లేదన్నా ఈసారి వెనక్కి తగ్గబోమని, పోటీ చేసి తీరుతామని, పరోక్షంగా తిరుగుబాటుకు సిద్ధమని చెబుతున్నారు. ఉత్తరకోస్తా, దక్షిణ, పశ్చిమ, తీర జిల్లాల నేతల్లో అసంతృప్తి ప్రబలంగా ఉంది. ఇదేనా తమకు పార్టీ ఇచ్చే గౌరవమని సీఎం వద్ద ఉన్న అగ్రనేతల్ని ప్రశ్నిస్తున్నారు. టికెట్లు కేటాయించిన నియోజకవర్గాల్లో ఏకాభిప్రాయం లేదు. నేతలు గ్రూపులుగా విడిపోయారు. అభ్యర్థులు చేపడుతున్న కార్యక్రమాలకు సమాంతరంగా సభలు, సమావేశాలు చేపడుతున్నారు. సీఎం నిర్ణయించిన అభ్యర్థులను ఓడించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. పరిస్థితి తీవ్రత గమనించిన సీఎం అసంతుష్టులను పిలిపించి మాట్లాడుతున్నా ఆయా చోట్ల పరిస్థితి యథాతథంగా కొనసాగుతోంది.



"కొద్ది సంవత్సరాలలో కాంగ్రెస్ డైనసార్ల(రాక్షస బల్లులు) లాగా అంతరించి పోతుంది. కాంగ్రెస్ వారు పరస్పరం కలహించుకుంటున్నారు. కాంగ్రెస్ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. వారు బీజేపీలో చేరుతున్నారు. 2024 ఎన్నికల తరవాత పిల్లలు కాంగ్రెస్ అంటే ఏమిటి అని అడుగుతారు."

- రాజ్ నాథ్ సింగ్, కేంద్ర మంత్రి

"పార్లమెంట్ సభ్యుడిగా సరిగ్గా వ్యవహరించకపోతే మా పార్టీ సభ్యుడినైనా సస్పెండ్ చేయాల్సిందే."

- పండిత్ నెహ్రూ

అసెంబ్లీ బరిలో

పూర్వపు సీఎంల తనయులు

“ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన ముఖ్యమంత్రుల కుమారులు, కుమార్తెలు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. వివిధ పార్టీల నుంచి వారి పేర్లను ఇప్పటికే అభ్యర్థులుగా ప్రకటించారు. ఇందులో ఆరుగురు పూర్వపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల తనయులు కాగా, మరో ఇద్దరు ముఖ్యమంత్రుల కుమార్తెలు పోటీకి సిద్ధమయ్యారు. పూర్వపు ముఖ్యమంత్రుల కుమారుల్లో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నందమూరి బాలకృష్ణ, నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీకి దిగారు. మరో ఇద్దరు మహిళలు దగ్గుబాటి పురంధేశ్వరి, వైఎస్ షర్మిల ఎంపీ అభ్యర్థులుగా పోటీకి సిద్ధమయ్యారు.”

రామారావు | రాజశేఖర్‌రెడ్డి | భాస్కరరావు | కోట్ల విజయభాస్కర్‌రెడ్డి | నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి | చంద్రబాబు నాయుడు

బాలకృష్ణ | జగన్‌మోహన్‌రెడ్డి | నాదెండ్ల మనోహర్ | జయసూర్యప్రకాశ్‌రెడ్డి | రామ్‌కుమార్‌రెడ్డి | నారా లోకేశ్

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి 2004, 2009లో రెండు విడతలుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేశారు. సుదీర్ఘకాలంపాటు కాంగ్రెస్ నేతగా వైఎస్ఆర్ కొనసాగారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం మారిన రాజకీయ పరిస్థితులతో జగన్ కాంగ్రెస్ పార్టీని వీడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ(వైసీపీ)ని స్థాపించారు. అనంతరం వచ్చిన ప్రత్యక్ష ఎన్నికల్లో 2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 67 అసెంబ్లీ స్థానాలు, 8 పార్లమెంట్ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో కేవలం 3 అసెంబ్లీ స్థానాలు, 1 పార్లమెంట్(ఖమ్మం) స్థానాన్ని వైసీపీ గెలుచుకుంది. దానితో 2014 నుంచి 2019 వరకు ఏపీలో ప్రతిపక్ష నేతగా జగన్ కొనసాగారు. 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ, 22 పార్లమెంట్ స్థానాలో వైసీపీ ఘన విజయం సాధించింది. సీఎం జగన్ పూర్తి మెజార్టీతో ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సొంత నియోజకవర్గమైన పులివెందుల అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు.

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వపు ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) తనయుడు. ప్రస్తుతం టీడీపీ హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు టీడీపీ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా నిమ్మకూరు ఎన్టీఆర్ స్వస్థలం. ఆయన చలనచిత్ర రంగంలో రారాజుగా నిలిచారు. ఆ తర్వాత రాజకీయ రంగ ప్రవేశం చేసి ఒక చరిత్ర సృష్టించారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని నెలకొల్పి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మూడు విడతలు ఎన్నికయ్యారు. ఢిల్లీలో తెలుగుజాతి ఖ్యాతి నిలిపేందుకు ఎన్టీఆర్ విశేష కృషి చేశారు. ఎన్టీఆర్ 1983 నుంచి 1984 వరకు, 1984 నుంచి 1989 వరకు, 1994 నుంచి 1995 వరకు మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు.

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈయన మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు తనయుడు. ప్రస్తుతం చంద్రబాబు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు సార్లు 1995 నుంచి 1999 వరకు మొదటిసారి, రెండో సారిగా 1999నుంచి 2004 వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేశారు. మూడోసారి విభజించిన ఆంధ్రప్రదేశ్‌కు 2014 నుంచి 2019 కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతల్ని నిర్వహించారు. ప్రస్తుతం టీడీపీ ఎన్డీఏ కూటమితో జతకట్టి, బీజేపీ, టీడీపీ, జనసేన సీట్లుసర్దుబాటు చేసుకుని ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. నారా లోకేశ్ 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఎన్నికై, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తొలి సారి 2019 ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, తన సమీప వైసీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లోనూ మంగళగిరి అసెంబ్లీ నుంచి లోకేశ్ పోటీకి దిగి, తన రాజకీయ భవిష్యత్‌ను తేల్చుకోను న్నారు. జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తనయుడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాస్కరరావు అతి తక్కువ కాలం సీఎంగా (16 ఆగస్టు 1984 నుంచి 16 సెప్టెంబర్ 1984) వరకు బాధ్యతలు నిర్వహించారు. నాదెండ్ల మనోహర్ జనసేన పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ (పీఏసీ) ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ తరపున అసెంబ్లీ స్పీకర్‌గా నాదెండ్ల మనోహర్ కీలకమై బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన అనంతరం మారిన రాజకీయ సమీకరణాలతో కాంగ్రెస్‌లో కొంతకాలం పనిచేశారు. 2019 ఎన్నికల్లో తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లోనూ తెనాలి నుంచి పోటీకి సిద్ధమయ్యారు.

వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డి (1992-94) తనయుడు. రామ్‌కుమార్‌రెడ్డి ఈ ఎన్నికల్లో నెల్లూరుజిల్లా వెంకటగిరి నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ విడత తన రాజకీయ భవిష్యత్‌ను పరిశీలించుకోనున్నారు. రామ్‌కుమార్‌రెడ్డి తల్లి నేదురుమల్లి రాజలక్ష్మీ కూడా రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. మరో నేత కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు (1982 నుంచి 1983, 1992 నుంచి 1994) ముఖ్యమంత్రిగా పనిచేసిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కుమారుడు. నాడు కాంగ్రెస్‌లో కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ప్రత్యక్ష పాత్ర పోషించారు. సొంత పార్టీలోనే అనేక సవాళ్లను, వర్గపోరును ఎదుర్కొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ఆయన తనయుడైన కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ప్రస్తుత నంద్యాలజిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

- విశాలాంధ్ర బ్యూరో-అమరావతి

లోక్‌సభకు పోటీకి పురంధేశ్వరి, షర్మిల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల తనయులూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. ఇందులో ఒకరు దగ్గుబాటి పురంధేశ్వరి. మరొకరు వైఎస్ షర్మిలారెడ్డి. వీరిద్దరూ చెరొక పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరి. ఈమె గతంలో విశాఖ నుంచి కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేసి, కేంద్ర మంత్రిగానూ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమె రాజమహేంద్రవరం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో వైసీపీ తరపున ఆమె ప్రచారం చేశారు. ఈ సమయంలో తాను జగనన్న వదిలిన బాణం అంటూ పంచ్‌లతో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె వ్యక్తిగత కారణాల రీత్యా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ(వైఎస్ఆర్‌టీపీ)ని స్థాపించి, తెలంగాణ రాష్ట్రంలో చురుకైన పాత్ర పోషించారు. మారిన రాజకీయాల నేపథ్యంలో ఆమె తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి కాంగ్రెస్ పీఠాన్ని ఛేజిక్కించుకున్నారు. కడప లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా తన సోదరుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి(వైసీపీ)పై పోటీకి దిగుతున్నారు.

దగ్గుబాటి పురంధేశ్వరి | వైఎస్ షర్మిల

కష్టజీవులకు ఊతం
తమ్మిన పోతరాజు

ఆయన చైతన్య స్ఫూర్తి. కష్టపడి ఎదిగిన ఆయన మరెందరో కష్టజీవులకు ఊతమయ్యారు. జైళ్లు, నిర్బంధాలు ఆయన్ని వెనక్కి లాగలేదు. నిబద్ధతతో లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేశారు. ఆయనే విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణదక్షుల్లో ఒకరైన తమ్మిన పోతరాజు. ఎమ్మెల్యేగా రెండుసార్లు పదవిని అలంకరించినా దాన్ని ప్రజల కోసమే ఉపయోగించి నేటి తరానికి ఆదర్శనీయులుగా నిలిచారు.

ఆదర్శ ప్రతినిధి

తమ్మిన పోతరాజు 1913వ సంవత్సరంలో విజయవాడలో పేద కుటుంబంలో జన్మించారు. వీరి బాల్యం కష్టాలతోనే గడిచిపోయింది. వారానికి ఒకటి రెండు రోజులైనా పస్తులతో ఉండటం పరిపాటయింది. ఆ దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటూనే స్కూలు ఫైనల్ వరకు చదువుకున్నారు. హైస్కూలు విద్యార్థిగా ఉన్న దశలోనే భారత స్వాతంత్ర్యోద్యమ పోరాట చరిత్ర, మాలపిల్ల మొదలైన ఉత్తమ గ్రంథాల అధ్యయనం ద్వారా ఉత్తేజితులై రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను భారతదేశం నుంచి పారద్రోలాలనే దీక్షతో జాతీయోద్యమంలో ప్రవేశించారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొన్నారు. విప్లవయోధులు భగత్‌సింగ్ మొదలగు వారు ఉరికంబాలకు ఎక్కారు. జితేంద్రనాథ్ దాసు జైలులో అసువులు బాశారు. ఈ సమయంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ విద్యార్థులకు నాయకత్వం వహించి సమ్మె చేయించారు.

పోతరాజు అతివాద భావాల వైపు మళ్లడానికి ఈ ఘటనలే ముఖ్య కారణమయ్యాయి. భగత్‌సింగ్ వంటి వీరుల వలే సాయుధ పోరాటం ద్వారా బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న భావంతో ఆయుధాలు ఉపయోగించడం నేర్చుకోవాలని కొన్నాళ్లపాటు సైన్యంలో చేరి పని చేశారు. 1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అయితే వాస్తవంగా అంతకు మునుపు నుంచే పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నారు. సోవియట్ రష్యాలో వలే ఈ దేశంలో కూడా కష్టజీవుల రాజ్యాన్ని నెలకొల్పాలన్న దృఢ దీక్ష, అవిరళ కృషి ఆయన్ను ప్రజా సేవకునిగా రూపొందించాయి.

విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, కార్మిక సంఘాల నిర్మాణకర్తగా పని చేశారు. విజయవాడలో అనేక కార్మిక సమ్మెలు, పోరాటాలను నడిపారు. 1948లో కమ్యూనిస్టు పార్టీపై ప్రభుత్వం దారుణ దమనకాండను అమలు జరిపిన సందర్భంలోనూ, అక్రమ కేసుల సందర్భంలోనూ సుమారు ఐదున్నర సంవత్సరాలు జైలు జీవితం అనుభవించారు. ఒకటిన్నర సంవత్సరం రహస్య జీవితం గడిపారు. 1952, 64 సంవత్సరాలలో రెండుసార్లు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ఉద్యమాల్లోనే కాకుండా శాసనసభలోనూ మంచి వక్తగా, మంచి దక్షత గల ప్రజానాయకుడిగా పేరు పొందారు.

చరిత్రకెక్కిన ఎన్జీ రంగా



ఎన్జీ రంగాగా చరిత్రలో నిలిచిన గోగినేని రంగనాయకులు లోక్‌సభ సభ్యునిగా నాలుగు సార్లు నాలుగు నియోజకవర్గాల నుంచి గెలుపొంది చరిత్రకెక్కారు. 1967లో జరిగిన ఉప ఎన్నికలలో శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఆయన అంతకుముందు 1957 ఎన్నికలలో తెనాలి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1964లో చిత్తూరు నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1980లో గుంటూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా, 1984, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 1971లో శ్రీకాకుళంలో స్వతంత్ర అభ్యర్థిగా, 1991లో గుంటూరులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. ఒక పర్యాయం రాజ్యసభకు కూడా రంగా ఎన్నికయ్యారు.

విశాఖలో వలసవాదులదే రాజ్యం...

వెనుకబడిన ఉత్తరాంధ్రకు ముఖద్వారంగా ఉన్న విశాఖలో వలసవాదుల పెత్తనం అధికమైంది. పారిశ్రామిక నగరంగా ఉన్న విశాఖపట్నం నేడు ఐటీ, టూరిజం, విద్య, వైద్య రంగాల్లో, రవాణా, నివాస రంగాల్లో అగ్రగామిగా ఉండడంతో పెట్టుబడు దారులు పెత్తనం కోసం విశాఖ వలస వచ్చి రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్నారు. 1989కు ముందు అంతా ఈ ప్రాంత ప్రజా సేవకు అంకితమైన రాజకీయ నేతలే పార్లమెంటు సభ్యులుగా గెలుపొందేవారు. ప్రస్తుతం విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థులంతా బడా పారిశ్రామికవేత్తలే కావడం విశేషం.

సుందర మైన విశాఖ నగరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ తర్వాత అంతటి వనరులు కలిగిన విశాఖపట్నంలో సూట్ కేసు నేతలదే హడావిడి ఉండేది. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులుగా సూటు కేసులతో వచ్చి సీటు కొట్టేసి వ్యాపారాలు చేసుకున్న వారే అత్యధికంగా ఉన్నారు. 1991 నుంచి నేటి వరకు స్థానికేతరులే ఎంపీలుగా గెలుపొంది వ్యాపారాలు చేసుకుంటూ విశాఖలో విలువైన కోట్లాది సహజ సంపదను దోచుకోవడంలో పార్లమెంట్ సభ్యులు దిట్టగా మారారని చెప్పక తప్పదు. 1991లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉమా గజపతిపై టీడీపీ అభ్యర్థి ఎంవీవీఎస్ మూర్తి 5,138 ఓట్ల మెజారిటీతో గోదావరి జిల్లాల నుంచి వచ్చి తొలిసారి స్థానికేతర ఎంపీగా గెలుపొందారు.

- సూట్ కేసుతో వచ్చి సీటు కొట్టేసిన నేతలు...
- 1991 నుంచి స్థానికేతరులే ఎంపీలుగా...

1996 లో వ్యాపారవేత్త టి సుబ్బిరామిరెడ్డి నెల్లూరు జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి పి ఆనంద్ గజపతి రాజు పై 7,459 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి సుబ్బరామిరెడ్డి పై టీడీపీ అభ్యర్థి ఎంవీవీ ఎస్ మూర్తి 38,912 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2004 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ముఖ్యమంత్రి నేదురుమిల్లి జనార్దన రెడ్డి టీడీపీ అభ్యర్థి ఎంవీవీ ఎస్ మూర్తి పై 1,30, 571 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2009 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పై 66,686 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కంభంపాటి హరిబాబు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వైఎస్ విజయమ్మపై 90,488 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ బిల్డర్ వైసీపీఅభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ టీడీపీ అభ్యర్థి ఎం శ్రీభరత్ పై 4,414 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుతం జరుగుతున్న 2024 ఎన్నికల్లో కూడా టీడీపీ తరఫున మళ్లీ ఎం శ్రీ భరత్ పోటీ చేస్తుండగా, వైసీపీ నుంచి మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పోటీ చేస్తున్నారు. గడచిన 35 ఏళ్లుగా వీరంతా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఎంపీలుగా ఎన్నికై వ్యాపారాలు చేసుకుంటూ విశాఖ కేంద్రంగానే రాజకీయాలు ప్రారంభించారు.

వీళ్లంతా స్థానికులే...

1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఉమా గజపతి రాజు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎంవీవీ ఎస్ మూర్తి పై 25,733 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1984 లో టీడీపీ నుంచి బాట్టం శ్రీరామమూర్తి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి అప్పలస్వామి పై 1,40, 431 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1980 లో కాంగ్రెస్ ఐ నుంచి కొమ్మూరి అప్పలస్వామి కాంగ్రెస్ యూ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామ మూర్తి పై 34,635 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1977 లో కాంగ్రెస్ నుంచి ద్రోణం రాజు సత్యనారాయణ లోక్ దళ్ పార్టీ నుంచి పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథం పై 42,829 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1971 లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పీవీజీ రాజు మరో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథంపై 67,188 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1967 లో తెన్నేటి విశ్వనాథం కాంగ్రెస్ అభ్యర్థి పి. వెంకటరావు పై 34,074 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1960 లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానంద్ ఉప ఎన్నిక సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1962 లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయానంద్ స్వతంత్ర అభ్యర్థి మద్ది పి రెడ్డి పై 91,142 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1957 లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పీవీజీ రాజు కాంగ్రెస్ అభ్యర్థి ఎం వి కృష్ణారావు పై 61,114 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1952 లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన లంక సుందరం కాంగ్రెస్ అభ్యర్థి కె సుబ్బరాజు పై 16,616 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏకగ్రీవంగా స్వతంత్ర అభ్యర్థిగా మల్లు దొర విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ...

విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. విజయనగరం జిల్లాలో ఉన్న ఎస్ కోట, విశాఖ జిల్లాలో ఉన్న భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర , దక్షిణ నియోజకవర్గాలు ఉన్నాయి. భీమిలి నియోజకవర్గంలో పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు స్థానికేతరులే. వీరు కూడా 30 ఏళ్ల క్రితం వ్యాపారాల కోసం విశాఖ వచ్చి రాజకీయాల్లో రాణిస్తున్నారు. విశాఖ తూర్పు లో కూడా మూడుసార్లు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెలగపూడి రామకృష్ణబాబు, ప్రస్తుతం వైసీపీ తరపున పోటీ చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ కూడా స్థానికేతరులే.

- విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం